సామాజిక, రాజకీయ పక్షపత్రిక

25 నవంబర్ 2017
పేజీలు : 36
వెల : 10/-

# జనసందేశ్

జాతీయ చైతన్య జ్వాల




## సీఎంను తాకిన బిజెపి నిరసన సెగ



# Swamy Vivekananda Seva Samithi Education Trust

Since 1988

## HINDU PUBLIC SCHOOL

### Affiliated to CBSE

SANATHNAGAR, HYDERABAD-18.Phone:04023704355,23711185
E-mail ID : hindu_pschool88@yahoo.com
Visit us : www.hindupublicschool.com



28 Years of Quality Education

✦ Affiliated to CBSE ✦ NCC (Boys & Girls) ✦ABACUS ✦ IIT✦YOGA
✦ DANCE ✦ MUSIC ✦ KARATE ✦ ART & CRAFT ✦ SPORTS

## HINDU TECHNO SCHOOL

### Regd. by Govt. of Telangana

APHB Colony, Opp. IDPL Colony, Chintal, HYDERABAD – 18
Phone : 040 – 23721122, 23079869
E-mail ID : hindutechno1@gmail.com
Vist us : www.hindutechnoschool.com



Building Firm Foundation for Bright Future

✦YOGA ✦ DANCE ✦ KARATE ✦ ART & CRAFT ✦SPORTS

## HINDU JUNIOR COLLEGE FOR GIRLS
## HINDU DEGREE & PG COLLEGE FOR WOMEN

Near Hanuman Devastanam, Sanath Nagar, Hyderabad – 18. Phone : 040 – 65505981
Visit us : www.hinducollegeforwomen.com

Courses Offered for INTERMEDIATE **M.P.C. - Bi.P.C - M.E.C. - C.E.C.**

**B.Sc.**
*Maths, Physics, Computer Science
*Maths, Statistics, Computer Science
*Maths, Chemistry, Computer Science
*Maths, Electronics & Computer Science
*Micro Biology, Chemistry, Computer Application
*Micro Biology, Bio-Technology, Chemistry



**B.Com.** * Regular * Computers **M.Com,M.Sc.** ✦ Computer Science * Organic Chemistry

**B. Shyam Sunder Goud**
B.Com., L.L.B.
Managing Trustee
Swamy Vivekananda Seva Samithi Education Trust








పేదల దుస్థితిని చూసి ఎవరి మనస్సు క్షోభిస్తుందో అతన్నే మహాత్ముడంటారు. –శ్రీ రామకృష్ణ పరమహంస

# జనసందేశ్

జాతీయ చైతన్య జ్వాల

సామాజిక, రాజకీయ పక్షపత్రిక

సంపుటి:28 | సంచిక:01 | 25 నవంబర్ 2017


ఈ సంచికలో...


- జిమ్మిక్కులతో ప్రజాహృదయాన్ని గెలవలేరు! ... 05
- కేసీఆర్ విధానాలతో సంక్షోభంలో వ్యవసాయం ... 06
- మద్యంపై మహిళా మోర్చా పోరుబాట ... 07
- గల్ఫ్ బాధితులకు బిజెపి అండ ... 08
- సీఎంను తాకిన బిజెపి నిరసన సెగ ... 09
- నిరుద్యోగ సమస్యపై నిగ్గదీసిన లక్ష్మణ్ ప్రసంగం ... 10
- ఘనంగా నల్లధన వ్యతిరేక దినోత్సవం ... 18
- మనిషి సమగ్ర పురోగతి సాధనాలు! ... 20
- దీన్‌దయాళ్ ఉపాధ్యాయ: నా హీరో ... 21
- కశ్మీర్‌లో మార్పు మొదలైంది ... 22
- ఆలోచనలను మలుస్తున్న వార్తాపత్రికలు ... 23
- నోట్లరద్దుతో ఎనలేని ప్రయోజనాలు ... 25
- రైతు సమన్వయ సమితి: ఓట్లు గుంజే ఎత్తుగడ ... 27
- శంకుస్థాపనలే... గృహప్రవేశాలేవి..!? ... 28
- ప్రశ్నార్థకంగా నాగార్జునసాగర్, శ్రీశైలం జలాలు! ... 29
- మతపరమైన రిజర్వేషన్లపై కేసీఆర్ మోసపూరిత ప్రకటనలు ... 31
- సత్ఫలితాలిస్తోన్న మోదీ సంస్కరణలు ... 33
- మోదీ తిరుగులేని నేత ... 34



మీ వార్తలు, సంబంధిత ఫోటోలు (ఫోటోలోని వారి పేర్లు, బాధ్యతలతో సహా) మెయిల్‌ద్వారా కూడా జనసందేశ్‌కు క్షణాల్లో పంపించవచ్చు. మీరు పంపవలసిన చిరునామా (ఈ-మెయిల్): janasandesh@yahoo.co.in

janasandeshmag@gmail.com

Phone No :040 24650866



Editor, Printer & Publisher : **MANTHRI SRINIVASULU**
on behalf of Bharateeya Janata Party and
Printed at Kala Jyothi Process Pvt. Ltd., RTC 'X' Roads,
Hyderabad.
Published at: Dr.Shyam Prasad Mukharji Bhavan,


# సంపాదకీయం

## జిమ్మిక్కులతో ప్రజాహృదయాన్ని గెలవలేరు!

ఆరు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ అనుసరించిన జిమ్మిక్కుల బాటలోనే ఈనాటి తెలుగు ప్రభువుల పాలనా రీతి కొనసాగుతోందని చెప్పడానికి ముఖ్యమైన మూడు సంఘటనలను ముచ్చటిస్తే చాలు.

షాబానో కేసులో 1985లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పట్ల ఆగ్రహావేశాలు వ్యక్తం చేసిన ముస్లి సమాజాన్ని సంతృప్తి పర్చడానికి ఆ తీర్పును వమ్ము చేస్తూ 1986లో రాజీవ్ ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. దాంతో ముస్లిం పురుషుడు భార్యకు విడాకులిస్తే ప్రజాధనం నుండి ఆమెకు భరణం చెల్లించాల్సి వచ్చింది. 'విడాకులిచ్చుట ముస్లిము వంతు, భరణం ఇచ్చుట హిందువులతో సహా అందరి వంతా ఇదేమి న్యాయం!' అని ఆగ్రహించిన హిందువులను తృప్తి పర్చడానికి అప్పటికి ఏళ్ళ తరబడి వివాదంలో కొనసాగుతున్న అయోధ్య రామమందిరం తాళాలు తెరిపించింది కాంగ్రెస్ ప్రభుత్వం. అలా వివాదాల పరిష్కారానికి, ప్రజల్లో సౌభ్రాతృత్వం నెలకొనడానికి తోడ్పడకపోగా ఉద్యమంగా మందిర్-మస్జిద్ వివాదం రూపుదిద్దుకోడానికి దారితీసిన విధానాలే కాంగ్రెస్ ప్రభుత్వాలను కూలదోశాయి.

కోర్టు తీర్పులను సైతం ఖాతరు చేయకుండా రిజర్వేషన్ల పేరిట కుల, మతాల ఓట్లకు గాలం వేసే ఓటుబ్యాంకు రాజకీయాలు, భాష మాటున భావోద్వేగాల వంచన, విధానాల్లోని డొల్లతనాన్ని ఆకర్షణీయమైన నినాదాలతో మరుగుపర్చడం, అస్మదీయులకో, అవినీతిపరులకో ప్రజాధనాన్ని దోచి పెట్టే పథకాలకు పెద్దపీట వేయడం, బడుగు బలహీన వర్గాలను మభ్యపెట్టే ఎత్తుగడలకు పాల్పడడం ఇలా మొత్తంగా పరిశీలిస్తే కాంగ్రెస్ అవలక్షణాలే తెలుగు నేలను ఏలుతున్న ప్రాంతీయ పార్టీల్లో గోచరిస్తున్నాయి. తమ పాలనా రీతులు, విధానాలు ప్రజాభిమానాన్ని ప్రోది చేయగలవనే నమ్మకం లేకనే తెలుగు పాలకులు ఇతర పార్టీల శాసన సభ్యులను ఆకర్షించే పనిలో పడ్డారు. ఆ ఫిరాయింపుల పర్వం కూడా అడ్డగోలుగా, నిర్లజ్జగా సాగుతున్న తీరు పాలకుల ఆత్మవిశ్వాస రాహిత్యాన్ని బట్టబయలు చేస్తున్నది. ఇది పాలకులకు సోకిన వ్యాధి ఫలితమే కాని, అసలు వ్యాధి వేరు. వ్యాధి మూలాన్ని గ్రహిస్తేనే సరైన చికిత్స సాధ్యం. ఏకాత్మ మానవ దర్శన సిద్ధాంతకర్త పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ సూత్రీకరణ ప్రకారం పాలకులకు ప్రజా మద్దతును సమకూర్చగల రాజమార్గం ఒక్కటే ఉంది.

'ఏకగ్రీవ ఆమోదం ఏ విషయంలో నైనా ఎక్కడా సాధ్యపడదు. ఐనప్పటికీ సాధారణ కోరిక అనే ప్రజాబాహుళ్య వాంఛితాన్ని పాలన లక్ష్యానికి పునాదిగా చేసుకున్నట్లయితే పాలన సరైన దిశగా సాగుతోందని, దానిలో తన ఆకాంక్షలు ప్రతిఫలిస్తున్నాయని సామాన్యుడు సైతం భావిస్తాడు.' అదొక్కటే ప్రజా మద్దతును ప్రోది చేయగల రాజమార్గం. రాజకీయాలను ప్రజాసేవకు ఉపకరణంగా ఎంచుకున్న వ్యక్తులకు, పార్టీలకు మాత్రమే దీనదయాళ్‌జీ సూత్రీకరణ అవగతం కాగలదు. పదవీ కాంక్ష, అధికార వ్యామోహం, వారసత్వ రాజకీయాలు వంటబట్టించుకున్న వారికి ఈ సూత్రం అర్థం కాదు, అర్థమైనా ఆచరించడం అంత తేలిక్కాదు. కనుక నేటి తెలుగు పాలకులకు ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగిరావాలని భావిస్తున్న బిజెపి ప్రజా మద్దతును ప్రోది చేయగల సాధనంగా ప్రజాబాహుళ్య వాంఛితాన్ని మలచుకోవాలి. ఇది హఠాత్తుగా, ఒక్కరోజులోనో ఒక్క పూటలోనో సాధ్య పడదు. సాధారణ ప్రజా వాంఛితాన్ని పార్టీలోని అట్టడుగుస్థాయి శ్రేణులు పసిగట్టి పార్టీ నాయకత్వానికి అందించాలి. వివిధ రూపాల్లో వ్యక్తమయ్యే దానికి ఒక రూపు దిద్దే బాధ్యతను పార్టీ రాష్ట్ర నాయకత్వం స్వీకరించి, దాన్ని పార్టీ శ్రేణుల ద్వారా తిరిగి ప్రజల్లోకి పంపి ఆమోదం సంపాదించాలి.

2019లో జరిగే ఎన్నికల దాకా ప్రజా ఉద్యమాలకు, ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలకు సైతం ప్రజా బాహుళ్య వాంఛితమే వెన్నుదన్ను కావాలి. జిమ్మిక్కులతో ప్రజా హృదయాన్ని గెలవలేరని పాలకులకు చాటి చెప్పాలి!

వర్తమానం

# కేసీఆర్ విధానాలతో సంక్షోభంలో వ్యవసాయం

సీఎం కేసీఆర్ అసమర్థ విధానాల వల్ల రాష్ట్రంలో వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నవంబర్ 5న సూర్యాపేట జిల్లాలో డా॥ లక్ష్మణ్ చేపట్టిన 'రైతు భరోసా యాత్ర'లో జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యటించి రైతులను పరామర్శించారు. దెబ్బతిన్న పంటపొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు కలవరపెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు రుణమాఫీ గుదిబండగా తయారైందని, కేవలం పుస్తకాల్లో రాసుకోవడానికే పరిమితమైందని చెప్పారు. ఆత్మకూర్(ఎస్) మండలంలో తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ఇచ్చిన వేరుశనగ విత్తనాలు మొలకెత్తలేదని అన్నారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో చెప్పినదానికి, క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన లేదని విమర్శించారు.

అంతకుముందు రోజు యండ్లపల్లిలో గ్రామంలో దోమకాటుకు గురైన పొలానికి ఓ రైతు ఆగ్రహంతో నిప్పు పెట్టారు. ఆ రైతును లక్ష్మణ్ పరామర్శించారు. దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. యండ్లపల్లిలో 400 మంది రైతులు 600 ఎకరాలకు గ్రామీణ వికాస్ బ్యాంకులో ఫసల్ బీమా యోజన కింద చెల్లించి పంట బీమాను చేయించారని, వరి పంట దెబ్బతిన్నదని 20 రోజులుగా రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని లక్ష్మణ్ నిప్పులు చెరిగారు. పంట నష్టం అంచనా వేయాలని కలెక్టర్‌ను కోరినా స్పందన లేదని అన్నారు.



సూర్యాపేటకు వచ్చిన రాష్ట్ర అధ్యక్షుడికి టేకుమట్ల వద్ద బిజెపి సూర్యాపేట నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి యండ్లపల్లి వరకు కార్యకర్తలతో కలిసి ర్యాలీగా తరలివచ్చారు.

జిల్లా మంత్రి జగదీష్ రెడ్డికి ఎద్దు, వ్యవసాయం లేదని, రైతులకు నష్టం జరిగిందని పత్రికల్లో వచ్చినా స్పందించకుండా సన్మానాలు చేయించుకోవడం సిగ్గుచేటని రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర రావు విమర్శించారు. టీఆర్ఎస్ కార్యకర్తలు వ్యాపారులపై ఒత్తిడి తెచ్చి మంత్రి జగదీష్ రెడ్డికి సన్మానం చేయిస్తున్నారని మండిపడ్డారు. రైతుల కష్టాలు చూడడానికి అనుచరులను పంపించడం సబబేనా ప్రశ్నించారు. మంత్రి కుటుంబ సభ్యులు పైరవీలు చేస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయం లేని వ్యక్తికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇస్తే రైతుల బాధలు ఎలా తెలుస్తాయని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులు రైతులను పట్టించుకున్నారా అని ప్రశ్నించారు.

ఈ పర్యటనలో సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కొణతం సత్యనారాయణ రెడ్డి, రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు గోలి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, అరవింద్, నూనె సులోచన, జీడీ భిక్షం, గంగారాజు, రుక్మారావు, చల్లమల్ల నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

–జనసందేశ్ ప్రతినిధి

## రైతు గొరిగె సోమయ్యకు భరోసా



రైతు భరోసా యాత్రలో భాగంగా దెబ్బతిన్న పంటపొలాలను పరిశీలించిన డా॥ కె.లక్ష్మణ్ రైతులతో నేరుగా మాట్లాడారు. యండ్లపల్లి గ్రామంలో రైతు గొరిగె సోమయ్యతో జరిగిన సంభాషణను చూద్దాం.

**లక్ష్మణ్:** తమ్ముడు ఏం వరి నాటు పెట్టావు?

**రైతు గొరిగె సోమయ్య:** ఎస్ఎల్ఆర్ సన్నరకం వరి నాటు పెట్టాను.

**లక్ష్మణ్:** దోమపోటు నివారణకు ఏం చేశావు? అధికారులు వచ్చారా?

**సోమయ్య:** ఐదు, ఆరు సార్లు మందు పిచికారి చేశాను. దోమపోటు తగ్గలేదు. అధికారులకు చెప్పినా.. రాలేదు.

**లక్ష్మణ్:** బ్యాంకులో రుణాలు తీసుకునేటప్పుడు బీమా సొమ్ము వసూలు చేశారా? అధికారులేమంటున్నారా..?

**సోమయ్య:** బీమా చెల్లించినా పరిహారం రాదని అధికారులు చెబుతున్నారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ఇస్తామని చెబుతున్నారు.

**లక్ష్మణ్:** అధైర్య పడొద్దు. ఎట్టి పరిస్థితుల్లో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తాం. నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా బిజెపి అండగా ఉంటుంది.



ప్రభుత్వం ఏ పార్టీదైనా ప్రజల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలి. – దీన్‌దయాళ్జీ

వర్తమానం

# మద్యంపై మహిళా మోర్చా పోరుబాట

టీఆర్ఎస్ ప్రభుత్వం మద్యం ఆదాయం పెంచే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ మండిపడ్డారు. తెలంగాణలో మద్యం ఏరులై పారుతుందని, మద్యంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా బిజెపి పెద్దఎత్తున ఉద్యమాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. పేదల బతుకులు ఛిద్రం చేస్తున్న మద్యాన్ని నియంత్రించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 16న హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎక్సైజ్ కార్యాలయం ముందు మహిళా మోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో లక్ష్మణ్ పాల్గొన్నారు.

ధర్నాలో లక్ష్మణ్ మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని లెక్క చేయడం లేదని వ్యాఖ్యానించారు. పేదల సంసారాలు మద్యం మత్తులో విచ్ఛిన్నం అవుతున్నా ప్రభుత్వానికి పట్టింపులేకపోవడం దురదృష్ట కరమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో బీరు–బారు, పబ్బులు–క్లబ్బులు, మాదకద్రవ్యాల సంస్కృతి తీవ్రమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వ మద్దతు, ప్రోత్సాహం ఉందని.., యువత, విద్యార్థులు వీటికి బానిసలవుతున్నా రని, వారి తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని వాపోయారు. అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై విచారం వ్యక్తం చేశారు.

ప్రతి సంవత్సరం మద్యం ఆదాయం పెంచడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని, ఇదేనా సీఎం కేసీఆర్ చెప్పే బంగారు తెలంగాణా అని ప్రశ్నించారు. మద్యంపై వార్షిక ఆదాయం సుమారు రూ.24 వేల కోట్లకు చేరిందని, మద్యం అమ్మకాల విలువ




రూ.50 వేల కోట్లకు చేరుకుంటున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది బంగారు తెలంగాణానా? లేక మద్యం తెలంగాణనా? అని ఎద్దేవా చేశారు.

గుడి–బడి వద్ద మద్యం దుకాణాలపై నిషేధం ఉన్నా విచ్చలవిడిగా ప్రభుత్వం అనుమతులిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాలలో, పట్టణాలలో బెల్ట్‌షాపులు విరివిగా ఉన్నాయని, ఇవి ప్రభుత్వానికి కనపడవా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఒకేమంత్రి బాగా పనిచేస్తున్నారని, అది ఎక్సైజ్ మంత్రేనని చురకలంటించారు. మద్యం అమ్మకాలను ప్రోత్సహించడానికి 'గోల్డెన్ అవర్స్', 'హ్యాపీ అవర్స్' పేర్లు పెడుతూ బార్లు, పబ్బులు వ్యాపారం చేసుకుంటున్నాయని మండిపడ్డారు. రెండు చీరలు కొంటే ఒక చీర ఉచితం అన్న చందంగా రెండు బీర్లు కొంటే ఒక బీరు ఫ్రీ లాంటి ఆఫర్లుపెట్టి అమ్మడం ఎంత వరకు సమంజసమని అన్నారు. మద్యం నియంత్రణ అమలు చేయాలని, బెల్ట్ షాపులను వెంటనే మూసివేసి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని డా॥ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మద్య నియంత్రణ చర్యలు చేపట్టకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల విజయ మాట్లాడుతూ... మద్యం వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ వారి సంసారాలు నష్టపోతున్నా ముఖ్యమంత్రి కేసీఆర్ కంటికి ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యం నియంత్రణకు తగిన చర్యలు చేపట్టేవరకు బిజెపి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఎక్సైజ్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల విజయ, మాజీ జడ్పీటీసీ చైర్మన్ సుహాసిని రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యదర్శులు వి.ఛాయాదేవి, జాజుల గౌరి, మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు ఎం.అరుణజ్యోతితో పాటు మహిళా కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.

మహిళా కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ ఖండించారు. రాష్ట్రంలో శాంతి యుతంగా ఉద్యమాలు చేసే పరిస్థితి లేదని, ప్రజలు తమ సమస్యలు చెప్పుకునే పరిస్థితి లేదని, ఈ రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్ట్‌లు చేస్తూ అమాయకులను భయభ్రాంతు లకు గురిచేస్తున్నారని, పోలీసు రాజ్యాన్ని కొనసాగిస్తున్నారని విమర్శించారు. 2019 ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని డా॥ లక్ష్మణ్ హెచ్చరించారు.

–జనసందేశ్ ప్రతినిధి




సిద్ధాంతాల పట్ల నమ్మకం ఎంత అవసరమో, వాటిని ఆచరణలో పెట్టడంలో క్రమశిక్షణ అంతే అవసరం. – దీన్‌దయాళ్జీ

వర్తమానం



# గల్ఫ్ బాధితులకు బిజెపి అండ

తెలంగాణ ఏర్పడి మూడున్నర సంవత్సరాలు అవుతున్నా గల్ఫ్ బాధితుల జీవితాల్లో మార్పు రాలేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగమిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ మూడున్నర సంవత్సరాలలో చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రవాస భారతీయుల హక్కుల, సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో నవంబర్ 11న నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లోని జంబి హనుమాన్ మైదానంలో 'ఉత్తర తెలంగాణ గల్ఫ్ బాధితుల పోరుబాట' సభలో ప్రసంగిస్తూ... ఇంటికో ఉద్యోగమిస్తే..., ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాయితీ రుణాలు ఇప్పిస్తే గల్ఫ్ వలసలు ఉండేవా? అని ప్రశ్నించారు. స్వయాన ముఖ్యమంత్రి కూతురు ప్రాతినిధ్యం వహించే నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో ఎంతో మంది గల్ఫ్ మృతుల కుటుంబాలు కష్టాలతో విలపిస్తుంటే ఎందుకు కనికరం కలగడం లేదని నిలదీశారు. ప్రభుత్వం గల్ఫ్ బాధితుల కోసం రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామన్న హామీ ఏమైందని నిప్పులు చెరిగారు. ఎన్నారై పాలసీ తీసుకొస్తామని చెప్పి ఇప్పుడు ఆ ఊసే లేదని మండిపడ్డారు. విదేశాల్లో చనిపోయినవారి బాధిత కుటుంబాలకు రూ.6లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం గల్ఫ్ బాధితులను ఆదుకుంటామన్న హామీలేవీ నెరవేరడం లేదని వ్యాఖ్యానించారు.

ఈ సభ ప్రారంభానికి ముందు గల్ఫ్‌లో మృతి చెందిన వారికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా 'గల్ఫ్ గోస' గోడప్రతులను డా॥ లక్ష్మన్ ఆవిష్కరించారు. గల్ఫ్ బాధిత కుటుంబాల వారు తమ కష్టాలను చెబుతూ కంటతడి పెట్టారు. తమను ఆదుకోవాలని వినతి పత్రాలు ఇచ్చారు. గల్ఫ్ బాధితులకు బిజెపి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం స్పందించకుంటే గల్ఫ్ బాధితుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### గల్ఫ్ బాధితులను ఆదుకోవాలి: రాంచందర్‌రావు

రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కోణంలో కాకుండా మానవత్వంతో గల్ఫ్ బాధిత కుటుంబాలను ఆదుకోవాలని బిజెపి శాసన మండలి పక్షనేత, ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు సూచించారు. కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ ట్వీట్ చేసిన గంటలో స్పందించి కార్మికులను ఆదుకునే చర్యలు చేపడుతున్నారని, కష్టాల్లో ఉన్నవారిని స్వదేశానికి రప్పిస్తున్నారని తెలిపారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని వాపోయారు. జాతీయ బీడీ కార్మిక సంక్షేమ నిధి సలహా సమితి ఉపాధ్యక్షుడు లోక భూపతిరెడ్డి మాట్లాడుతూ గల్ఫ్‌కు వెళ్లిన వారి కుటుంబాలలో బీడీ కార్మికులు ఉంటే కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా రూ.లక్షన్నర రాయితీతో ఇళ్ల నిర్మాణం చేయిస్తామని తెలిపారు. ప్రవాస భారతీయుల హక్కుల, సంక్షేమ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కోటపాటి నర్సింహా నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి, గల్ఫ్ బాధితుల కష్టాలను నిర్లక్ష్యం చేయడంతో పోరుబాట పట్టక తప్పడం లేదని పేర్కొన్నారు. ప్రవాస మిత్ర గల్ఫ్ కార్మిక సంఘం అధ్యక్షుడు మంద భీంరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి పన్ను రూపేణా రూ.2వేల కోట్లు వచ్చినా ప్రభుత్వం బాధితుల సంక్షేమానికి నిధులు కేటాయించలేదని తెలిపారు. ప్రవాస భారతీయుడు ఏముల రమేష్ మాట్లాడుతూ దుబాయిలోని లేబర్ క్యాంపులలో తెలంగాణ వాసులు ఎన్నో కష్టాలు పడుతున్నారని వాపోయారు.

మార్కెట్ యార్డు నుంచి సభా వేదిక జంబి హనుమాన్ మైదానానికి ఉత్తర తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చిన గల్ఫ్ బాధిత కుటుంబాలు ర్యాలీగా వచ్చాయి. వారు ప్లకార్డులు ప్రదర్శించి తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రవాస భారతీయుల హక్కుల, సంక్షేమ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కోటపాటి నర్సింహా నాయుడు సభకు అధ్యక్షత వహించారు. డా॥ కె.లక్ష్మన్, ఎన్.రాంచందర్‌రావు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, బిజెపి జిల్లా అధ్యక్షుడు పల్లె గంగారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధర్మపురి అరవింద్, బస్వా లక్ష్మినర్సయ్య, ఆనంద్ రెడ్డి, హన్మంత్ రెడ్డి, సదానంద్ రెడ్డి, లింగారెడ్డి, శివరాజ్ కుమార్, సూర్యనారాయణ, వీరగోపాల్ తో పాటు పెద్దసంఖ్యలో గల్ఫ్ బాధిత కుటుంబాల ప్రజలు ఈ పోరుబాటలో పాల్గొన్నారు.

**–జనసందేశ్ ప్రతినిధి**



నేను, నా దేశం – ఈ రెంటిలో నా దేశమే నాకు ముఖ్యమైనది. – డా॥ బి.ఆర్.అంబేద్కర్




ముఖచిత్ర కథనం

• భువన

# సీఎంను తాకిన బిజెపి నిరసన సెగ

నిరుద్యోగ సమస్యపై టీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ బిజెపి ఉద్యమాలను ఉధృతం చేసింది. ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 7న చేపట్టిన 'ఛలో అసెంబ్లీ'తో ప్రభుత్వంలో వణుకు పుట్టించింది. యువమోర్చా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బిజెపి నేతలు, కార్యకర్తలే కాకుండా రాష్ట్రంలోని నిరుద్యోగులు, విద్యార్థులు, యువకుల నుంచి విశేష మద్దతు లభించింది. టీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాష్ట్ర నలుమూలల నుంచి హైదరాబాద్‌కు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. మూడున్నరేళ్లుగా నియామకాలు జరపక, మాటలతో మభ్యపెడుతూ నిరుద్యోగులను ఉసూరు మనిపిస్తున్న సీఎం కేసీఆర్‌కు నిరసన సెగ తగిలేలా అసెంబ్లీ దిశగా కదిలారు.

బిజెపి పిలుపునందుకొని వేలాదిగా కదిలి వస్తోన్న కాషాయ సేనను చూసి టీఆర్‌ఎస్ ప్రభుత్వం కుంగుతిన్నది. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ పోలీసులను మోహరించి, ఎక్కడికక్కడ అరెస్టులకు తెగబడింది. ముందురోజు నుంచే నిర్బంధాలకు తెరతీసింది. వేలాది మంది బిజెపి నాయకులను, కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేసింది.

హైదరాబాద్ బషీర్‌బాగ్ నుంచి అసెంబ్లీ దిశగా బయలుదేరిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పి. మురళీధర్ రావు, శాసనసభాపక్ష నాయకుడు జి.కిషన్ రెడ్డి, శాసనసభ్యులు చింతల రామచంద్రా రెడ్డి, ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్, రాజాసింగ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వై.గీత, రాష్ట్ర కార్యదర్శి పి.పాపా రావు, అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ తదితరులతోపాటు అనేకమంది నాయకులను, పెద్ద సంఖ్యలో కార్యకర్తలను అరెస్ట్ చేశారు.

అసెంబ్లీ వద్ద శాసనమండలి నాయకులు ఎన్. రాంచందర్ రావు, బిజెపి ఉపాధ్యక్షుడు డా॥ కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, డా॥ గంగిడి మనోహర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రఘునందన్ రావు, రాష్ట్ర కార్యాలయ కోఆర్డినేటర్ దాసరి మల్లేశం తదితరులు అరెస్టయ్యారు.

వివిధ ప్రాంతాలలో మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల విజయ, బిజెపి రాష్ట్ర కార్యదర్శులు జాజుల గౌరి, వి.ఛాయాదేవి, మజ్దూర్ సెల్ రాష్ట్ర కన్వీనర్ వి.చంద్రశేఖర్ యాదవ్ తదితరులు అరెస్టయ్యారు. హైదరాబాద్‌లోని పోలీస్ ఠాణాలన్నీ బిజెపి నాయకులతో నిండిపోయాయి.

జిల్లాల్లో ఇందుకు భిన్నమైన పరిస్థితులేమీ లేవు. ఎక్కడిక్కడ బిజెపి నాయకులను, కార్యకర్తలను నిర్బంధించారు. ఒకరోజు ముందే నవంబర్ 6నే యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్‌తో పాటు బీజేవైఎం ప్రధాన కార్యదర్శులు దూది శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్ నాయుడులను అరెస్టు చేసి నిర్బంధించారు. బిజెపి తలపెట్టిన 'ఛలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని విఫలం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు చేయని ప్రయత్నం లేదు. ప్రభుత్వం ఎంత నిరంకుశంగా వ్యవహరిస్తే పార్టీ శ్రేణులు అంత పట్టుదలగా ముందుకెళ్లాయి. సుమారు 10 వేల మందికి పైగా కార్యకర్తలను అరెస్టు చేశారు. ప్రభుత్వం, పోలీసులు ఎంత నిర్బంధాలకు దిగినా 'ఛలో అసెంబ్లీ' కార్యక్రమం విజయవంతం అయ్యింది. ఇంటికో ఉద్యోగం అంటూ హామీలిచ్చి నియామకాలు జరపడం మరచిపోయిన టీఆర్‌ఎస్ ప్రభుత్వంలో, సీఎం కేసీఆర్‌లో ప్రకంపనలు సృష్టించింది.

టీఆర్‌ఎస్ నిరంకుశ వైఖరిని ఖండిస్తూ డా॥ కె.లక్ష్మణ్ "తెలంగాణలో ఉద్యమాలు, పోరాటాలు శాంతియుతంగా చేసే పరిస్థితి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం నియంతగా వ్యవహరిస్తుంది. రాష్ట్ర ప్రజలు నిజాం నియంత పాలనను, ఇందిరాగాంధీ కాంగ్రెస్ నిరంకుశ పాలనను చూశారు. వారికి తగిన బుద్ధి చెప్పారు. ఇప్పుడు టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తగిన సమయంలో బుద్ధి చెప్తారు." అని అన్నారు. అటు శాసనసభలో ప్రజా సమస్యలపై మాట్లాడకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని, బయట నిర్బంధకాండ కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఖాళీలు భర్తీ చేసేంత వరకు పోరాటం కొనసాగిస్తామని డా॥ లక్ష్మణ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బిజెపి, యువమోర్చా కార్యకర్తల అక్రమ అరెస్టులను, నిర్బంధాన్ని నిరసిస్తూ మరుసటిరోజు నవంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో ధర్నాలు, ఆందోళనలు చేపట్టి, టీఆర్‌ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ■

ఆత్మగౌరవాన్ని నష్టపరచుకొని జీవించే జీవితం మృత్యువు కంటే హీనమైనది. – భర్తృహరి

# నిరుద్యోగ సమస్యపై నిగ్గదీసిన లక్ష్మణ్ ప్రసంగం

**నవంబర్ 14న అసెంబ్లీలో 'నిరుద్యోగం మరియు ప్రభుత్వ నియామకాలు' అన్న అంశంపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ చర్చ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ నియామకాలపై టీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ అసెంబ్లీలో ప్రసంగించారు. జనసందేశ్ పాఠకుల కోసం డా॥ లక్ష్మణ్ ప్రసంగ పాఠం ప్రచురిస్తున్నాము.**

అధ్యక్షా... రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య గురించి రాస్తే రామాయణం.. చెబితే భారతం అవుతుంది. నీళ్లు, నిధులు, నియామకాలు తెలంగాణ ఉద్యమ నినాదం. ఉద్యోగాల్లో జరిగిన అన్యాయం కోసమూ మనం ప్రత్యేక రాష్ట్రం కోరుకున్నాం. 610 జీవో, 36 జీవోపై విస్తృతంగా ప్రచారం జరిగింది. మన కొలువులు ఆంధ్రోళ్లు దోచుకున్నారు.. మన రాష్ట్రం ఏర్పడితే అవన్నీ మనకే వస్తాయని అన్నారు. అందుకే నిరుద్యోగులు ప్రాణాలకు సైతం తెగించి ఉద్యమంలో ముందుండి రాష్ట్రాన్ని తెచ్చుకున్నారు. సహజంగా రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగాలు వస్తాయన్న ఆశ వారికి ఉంటుంది. దానికితోడు ఇంటికో ఉద్యోగం అంటూ టీఆర్ఎస్ ఎన్నికల వేళ హామీలు గుప్పించారు. దీంతో ఉద్యోగాలు వస్తాయని.. జీవితంలో స్థిరపడొచ్చని వారనుకున్నారు. కానీ నిరుద్యోగులను ఎగతాళి చేస్తూ సీఎం గారు ఏమన్నారు...? "నిరుద్యోగ యువకులందరికీ ప్రభుత్వ ఉద్యోగం కల్పించడం... ఇది అయ్యే పనేనా..? ఇది సాధ్యమా..? ఏ ప్రభుత్వమైన కల్పిస్తదా..?". ఇవా సీఎం అనాల్సిన మాటలు... ఇవే మాటలు ఎన్నికలప్పుడు అనగలరా..? అని ఓట్లు అడగ్గలరా..?

అన్న మాటను అనలేదనడం.. అవసరమైతే తల నరుక్కుంటాను కానీ మాట తప్పనంటూనే మాట మర్చడం... సీఎం గారికి పరిపాటయ్యింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత నవంబర్ 24 2014న రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అసెంబ్లీలో ప్రసంగిస్తూ విభజన తర్వాత రాష్ట్ర వాటాకు 5,23,675 ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. కానీ మూడున్నర ఏళ్లలో ఎన్ని ఖాళీలు భర్తీ చేశారు..? 16 వేలా..!

ఈ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ హౌజింగ్ కార్పొరేషన్‌ను పూర్తిగా ఎత్తేసి 20 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న 1179 మంది ఉద్యోగులను తొలగించారు. సిరులు పండించే



సింగరేణిలో కొలువుల సంఖ్యను 1.16 లక్షల నుంచి 23 వేలకు కుదించారు. విద్యుత్ శాఖలో 23వేల కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిని క్రమబద్ధీకరిస్తామని చెప్పినా అదీ ముణ్నాల ముచ్చటే అయ్యింది. దీంతో నలుగురు కాంట్రాక్టు కార్మికులు ఆత్మహత్యకు పాల్పడడం ఈ ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతుంది. రాష్ట్ర ఏర్పాటుకు ముందు తెలంగాణలో ఆత్మహత్య లున్నాయి. రాష్ట్ర ఏర్పడ్డాకా ఆ ఆత్మహత్యలు కొనసాగడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం.

కొత్తగా 21 జిల్లాలు ఏర్పడ్డాయి. వీటితో పాటు రెవెన్యూ డివిజన్లు, సర్కిళ్లు, పోలీస్ స్టేషన్లు ఏర్పాటయ్యాయి. సుమారుగా ఒక్కో జిల్లాకు కొత్తగా 1000 మంది సిబ్బంది అవసరం అనుకున్నా.. 20వేల ఉద్యోగాలు ఖాళీగానే ఉన్నాయి. అవన్నీ భర్తీ కాలేదు. ఇక రాష్ట్రంలోని 13 విశ్వవిద్యాలయాల్లో 2000 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 560 మంది పార్ట్‌టైం లెక్చరర్స్‌తోనే పని కానిచ్చేస్తున్నారు. బాసర ఐఐఐటీలో అయితే మొత్తం కాంట్రాక్టు ఉద్యోగులే. పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు ఇదే పరిస్థితి. సరైన సిబ్బంది లేకుండా మెరుగైన విద్య ఎలా అందించగలం..? ముఖ్యమంత్రి చైర్మన్‌గా ఉన్న వాటర్ వర్క్ బోర్డులో కాంట్రాక్టు ఉద్యోగులు పర్మినెంట్ కోసం సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారు. ఇక పంచాయితీరాజ్ వ్యవస్థలో 4300 పోస్టులకు 2వేలకు పైగా ఖాళీలున్నాయి. రీపాట్రియేషన్ తో ఏర్పడే ఖాళీలు 80వేలు.. గత మూడున్నర సంవత్సరాలుగా రిటైర్మెంట్లతో ఏర్పడిన ఖాళీలు 50 వేలు.. కొత్త జిల్లాలతో ఏర్పడ్డ ఖాళీలు.. ముందున్నుంచున్న ఖాళీలు.. టీచర్లు, జేఎల్, డీఎల్, వీఆర్వో, హెల్త్ డిపార్ట్‌మెంట్ ఇవన్నీ చూస్తే లక్షపైనే ఉంటాయి... మొత్తం కలుపుకొంటే మూడు లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీలున్నాయి.

సర్కార్ కొలువుల్లో ఇన్ని ఖాళీలున్నా వాటిని భర్తీ చేయక ఉద్యోగాల కోసం యువత, నిరుద్యోగులు పెట్టుకున్న ఆశలు అడియాసలవుతున్నాయి. ఏ కొలువుల కోసమైతే ప్రాణాలొడ్డి

కొట్లాడారో.. ఆ యువత, విద్యార్థి, నిరుద్యోగ లోకాన్ని నట్టేట ముంచారు. ఉద్యమ పార్టీ తమ సమస్యలు అర్థం చేసుకుంటుందని టీఆర్ఎస్‌ను తాడు అనుకొని మెడలో వేసుకున్నారు... కానీ అది ఉరితాడయితదని అనుకోలేదు. 2015లో ఇదే అసెంబ్లీలో సీఎం మాట్లాడుతూ.. లక్షా ఏడు వేల ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేస్తామన్నారు. కానీ ఇప్పటివరకు 16 వేల మందికే నియామక పత్రాలు అందజేశారు. 16 వేల నియామకాలకు మూడున్నర ఏళ్లు పడితే లక్షా 12వేల ఉద్యోగాలివ్వాలంటే ఇంకెన్ని సంవత్సరాలు కావాలి..? ఇదీ ఈ టీఆర్ఎస్ ప్రభుత్వానికి నిరుద్యోగులపై ఉన్న శ్రద్ధ.. వారి పట్ల ఉన్న చిత్తశుద్ధి. ప్రభుత్వం యూపీఎస్సీ మాదిరిగా ఉద్యోగ క్యాలెండర్‌ను ప్రకటించాలి.

## టీఎస్పీఎస్సీ

టీఎస్పీఎస్సీ గురించి ఏం చెప్పాలి.. చెప్పుకోవడానికి దీని గురించి ఒక సానుకూలాంశమైన ఉందా..? ఇంతవరకు ఒక్క నియామకాన్నైనా సకాలంలో సక్రమంగా పూర్తి చేసిందా..? ప్రతి నోటిఫికేషన్ లోపభూయిష్టమే.. ప్రతి దశలో కోర్టు చిక్కులే.. ప్రశ్నాపత్రాల్లో తప్పులు.. మూల్యాంకనంలో పొరబాట్లు.. వైట్నర్ పైనా వివాదాలు.. ఇక సాఫ్ట్‌వేర్ లోపాలు... టీఎస్పీఎస్సీకి పొరబాట్లు అలవాటుగా మారాయి. తన వైఫల్యాలతో నిరుద్యోగుల జీవితాలతో ఆటాడుకుంటోంది.

121 పోస్టులున్న గ్రూప్1 నియామకాలు జరిపేందుకే టీఎస్పీఎస్సీకి తల ప్రాణం తోకకొస్తుంది. టీఎస్పీఎస్సీ వైఫల్యంతో నియామకాల కోసం 2011 నాటి గ్రూప్1 అభ్యర్థుల నిరీక్షణకు ఇంకా కొనసాగుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో నాటి పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వాకంతో మొదలైన వారి కష్టాలకు తెలంగాణలోనూ తెరపడలేదు. ఈ నియామకాల్లో అడుగడుగునా అవకతవకలు న్నాయి. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ



అభ్యర్థులకు 2016లో మళ్లీ పరీక్ష పెట్టిన టీఎస్పీఎస్సీ 2017లో ఇంటర్వ్యూలు పూర్తి చేసింది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియామావళి మేరకు మెరిట్ లిస్టు ముందు పెట్టి సెలక్షన్ లిస్టును తర్వాత పెట్టాలి. కానీ ఘనత వహించిన మన టీఎస్పీఎస్సీ మాత్రం డైరెక్టుగా సెలక్షన్ లిస్టునే పెట్టారు. అందులోనూ అన్నీ అవకతవకలే.. అనుమానాలే. 4వ ర్యాంకు అభ్యర్థికి 17వ ప్రాధాన్యత ఉద్యోగం.. 9వ ర్యాంకు అభ్యర్థికి 16వ ప్రాధాన్యత ఉద్యోగం ఇచ్చారు. ఎంపికైన అభ్యర్థులు మరోసారి ఆందోళనకు దిగితే ఆ లిస్టునూ ఆపేశారు. 121 నియామకాలకే ఇంత గందరగోళం సృష్టిస్తే... సీఎం చెప్తున్నట్టు లక్షా12 వేల ఉద్యోగాలకు ఇంకెంత కన్ఫ్యూజన్ క్రియేట్ చేస్తారనేది ఆందోళన కలుగుతుంది.

**టీఎస్పీఎస్సీకి మాత్రం పది మంది సభ్యులున్నారు.. ఉమ్మడి రాష్ట్రంలో కూడా నాటి పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు పది మంది సభ్యులు లేరు.. కానీ ఇప్పుడున్నారు.. వారికి జీత భత్యాలు.. క్యాబినెట్ హోదా... అసలు టీఎస్పీఎస్సీ రాష్ట్రంలో నిరుద్యోగం తీర్చడానికా..? లేక.. అధికార పార్టీలో ఉన్న రాజకీయ నిరుద్యోగం తీర్చడానికా..?**

టీఎస్పీఎస్సీపై లక్షలాది జీవితాలు ఆధార పడి ఉన్నాయి.. కానీ ఈ కార్యాలయంలో పకడ్బందీ ఐటీ విభాగం లేదు.. మాట్లాడితే మన ముఖ్యమంత్రి, మంత్రులు డిజిటల్ తెలంగాణ, హైటెక్ హైదరాబాద్ అని గొప్పలు చెప్పుకుంటారు... కానీ కీలకమైన టీఎస్పీఎస్సీలో ఐటీ విభాగం లేకపోవడంపై ఎవరిని నిందించాలి..? ఇది ఐటీ మంత్రి వైఫల్యం కాదా.. వారి చేతకానితనం, అసమర్థత కాదా.. తమకు 178 మంది సిబ్బంది కావాలని 2015 మార్చిలో టీఎస్పీఎస్సీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తే.. 2015 ఆగస్టులో ప్రభుత్వం కేవలం 38 పోస్టులను మాత్రమే మంజూరు చేసింది. కానీ ఇంతవరకు



వాటి నియామకాలకు మాత్రం అనుమతివ్వలేదు. మరోసారి 2016లో కనీసం 95 పోస్టులయినా మంజూరు చేయాలని టీఎస్పీఎస్సీ ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా.. ఇంతవరకు స్పందన లేదు.

ఉద్యోగ కల్పన ప్రభుత్వ విధి.. కానీ ఎవరి ఉద్యోగ కల్పనకు ఈ ప్రభుత్వం టీఎస్పీఎస్సీ ఏర్పాటు చేసింది? నిరుద్యోగుల కోసం నియామకాలు అయితే లేవు కానీ.. టీఎస్పీఎస్సీకి మాత్రం పది మంది సభ్యులున్నారు.. ఉమ్మడి రాష్ట్రంలో కూడా నాటి పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు పది మంది సభ్యులు లేరు.. కానీ ఇప్పుడున్నారు.. వారికి జీత భత్యాలు.. క్యాబినెట్ హోదా... దర్పం, ప్యూను, ఫ్యాను... అసలు టీఎస్పీఎస్సీ రాష్ట్రంలో నిరుద్యోగం తీర్చడానికా..? లేక.. అధికార పార్టీలో ఉన్న రాజకీయ నిరుద్యోగం తీర్చడానికా..?

టీఎస్పీఎస్సీ గురించి ప్రతీరోజూ వార్తలొస్తున్నాయి.. అవన్నీ నెగటివ్ హెడ్ లైన్సే... పాజిటివ్‌గా ఒక్కటి కూడా రాలేదు. టీఎస్పీఎస్సీ ప్రతిష్ఠ రోజురోజుకు ఇంతలా దిగజారిపోతున్నా ఈ ప్రభుత్వం మాత్రం పట్టనట్టే వ్యవహరిస్తుంది. పైపెచ్చు కితాబు ఇస్తున్నారు. అసలు ఈ ప్రభుత్వానికి ఉద్యోగ విధానం అంటూ ఉందా..? ఉంటే అదేంటో రాష్ట్ర ప్రజలకు తెలియ జేయాలి.

## విద్యారంగం

రాష్ట్రంలో విద్యారంగంపై సీఎం కేసీఆర్ వ్యవహార శైలి.. నోటితో చెప్పి నొసటితో వెక్కిరిస్తున్నట్టు ఉంది. ఎన్నికల్లప్పుడు కేజీ టూ పీజీ ఉచిత విద్య అంటూ హామీలిచ్చిన కేసీఆర్ గారు ఇప్పుడేమో కండీషన్స్ అప్లై అంటూ... ఆ హామీని నీరుగారుస్తున్నారు. ప్రభుత్వ అసమర్థ విధానాలతో రాష్ట్రాభివృద్ధికి, యువతకు ఉపాధి కల్పనకు దోహదం చేసే విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమవుతోంది.


బొల్లారం పోలీస్ స్టేషన్‌లో కిషన్ రెడ్డి తదితరులు

పేదోడికి విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు కొత్త బడులు తెరవాల్సింది పోయి.. హేతుబద్ధీకరణ పేరుతో ఉన్న స్కూల్స్‌నే మూసేస్తున్నారు. దాదాపు 6వేల బడులు మూతబడట్టు సమాచారం. ఉన్న స్కూల్స్‌లోనూ గత కొన్నేళ్లుగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశారు కానీ అందులో నియామకాలు మాత్రం జరపలేదు. రాష్ట్రంలో 40వేల టీచర్ పోస్టులు ఖాళీలున్నాయి. వీలైనంత తొందరలో ఆ ఖాళీలను భర్తీ చేస్తే ఇటు పేదలకు నాణ్యమైన విద్య అందడంతో పాటు కొంతమందికి ఉద్యోగాలు కూడా దొరుకుతాయి. కానీ ముఖ్యమంత్రి గారు మాత్రం... "డీఎస్సీకి తొందరేముంది..? ప్రపంచం మునిగి పోతుందా..?" అంటూ టీచర్ అభ్యర్థులను హేళన చేస్తున్నారు. టీచర్ పోస్టుల కోసం దాదాపు 5 లక్షల మంది ఎదురు చేస్తున్నారు. టీచర్ పోస్టులపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అసెంబ్లీలో 24వేలు ఖాళీలు ఉన్నాయని... క్యాబినెట్ సమావేశంలో 15 వేలు ఖాళీలున్నాయని చెప్తున్నారు. చివరికి టీఆర్టీ ద్వారా 8792 ఖాళీలే అని సరిపెడుతున్నారు.

**ఇంతకూ... అసలు ఖాళీలెన్ని?**

**ఉపాధ్యాయ ఖాళీలపై ఒక్కోసారి ఒక్కో లెక్క.. వాస్తవ లెక్కలపై దోబూచులాట..**

☞ 2014 నవంబరులో అసెంబ్లీలో ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ గారు చెప్పినవి 24,861

☞ 2015 ఆగస్టు నాటికి విద్యాశాఖ తేల్చిన లెక్కల ప్రకారం 17,702

☞ 2015 డిసెంబరులో కేబినెట్ ఆమోదించినవి 12,142

☞ 2016 జులై 16న అంతర్రాష్ట్ర మండలికి చెప్పినవి 16,193

**రాష్ట్రంలో 40వేల టీచర్ పోస్టులు ఖాళీలున్నాయి. వీలైనంత తొందరలో ఆ ఖాళీలను భర్తీ చేస్తే ఇటు పేదలకు నాణ్యమైన విద్య అందడంతో పాటు కొంతమందికి ఉద్యోగాలు కూడా దొరుకుతాయి. కానీ ముఖ్యమంత్రి గారు మాత్రం... "డీఎస్సీకి తొందరేముంది..? ప్రపంచం మునిగి పోతుందా..?" అంటూ టీచర్ అభ్యర్థులను హేళన చేస్తున్నారు.**

☞ 2016 నవంబరులో ఆర్థిక శాఖ, విద్యాశాఖ వేసిన లెక్కల ప్రకారం 11,329

☞ టీఆర్టీ నియామకాలకు ఇటీవల అసెంబ్లీలో ప్రకటించిన ఖాళీలు 8,792

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2014 నవంబరు నాటికి 24,861 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే.. ఇప్పుడు 8,792 పోస్టుల భర్తీకి కసరత్తు మొదలైంది. మిగతా పోస్టులు ఏమయ్యాయి? పోస్టులు ఎందుకు తగ్గిపోయాయి? అయితే మధ్య కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య 2 లక్షల వరకు తగ్గిపోయింది. ఆ మేరకు విద్యాశాఖనే పోస్టులను తగ్గించిందా? వాస్తవానికైతే రిటైర్మెంట్ల ద్వారా ఏర్పడే ఖాళీలు కలుపుకొంటే పోస్టుల సంఖ్య పెరగాలి. కానీ ఇక్కడ మాత్రం తగ్గిపోయాయి. దీనిపై విద్యాశాఖ వద్ద సమాధానం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయ ఖాళీలపై విద్యాశాఖ ఒక్కోసారి ఒక్కో లెక్క చెబుతోంది. కేంద్రం అడిగినప్పుడు.. రాష్ట్ర ప్రభుత్వం తేల్చాలన్నప్పుడు... సుప్రీంకోర్టు కేసు విచారణకు వచ్చినప్పుడు.. ఒక్కో సందర్భంలో ఒక్కో లెక్క చెబుతోంది. విద్యాశాఖ ఒక లెక్క చెబితే.. ప్రభుత్వం మరో లెక్క చెబుతోంది. అసలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల్లో వాస్తవ ఖాళీలెన్ని అనేది ఓ బ్రహ్మపదార్థంలా తయారైంది.

వాస్తవానికైతే ప్రభుత్వ పాఠశాలల్లో పీఈటీల పోస్టులను పెంచాలి. కంప్యూటర్ ట్రైనర్ల పోస్టులూ ఖాళీగా ఉన్నాయి. విద్యా వాలంటీర్ల పోస్టులు 11,500 వరకు ఖాళీగానే ఉన్నాయి. టీఆర్టీ నియామకాల ప్రకటనలోనూ టీఎస్పీఎస్సీ వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపించింది. రాష్ట్రపతి ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ నియామక ప్రకటన విడుదల చేయడంతో... కొందరు అభ్యర్థులు కోర్టుకు వెళ్లారు. 10 జిల్లాలకు కాకుండా 31 జిల్లాల ప్రాతిపదికన నియామకాలు ఉండడంతో... ఇది రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధం అంటూ ఈ నియామక ప్రక్రియను కోర్టు ప్రశ్నిస్తుంది. టీఎస్పీఎస్సీ, టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యం మరోసారి బయటపడింది. మహిళా కాలేజీల్లో లెక్చరర్లకు మహిళలకు మాత్రమే అర్హులు అంటూ ప్రభుత్వం నియామకాల ప్రకటన విడుదల చేసింది.. కోర్టు చివాట్లు పెట్టడంతో అదీ నిలిచిపోయింది.

యూనివర్సిటీ విద్య కూడా నానాటికీ తీసికట్టుగా మారుతుంది. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో టీచింగ్ స్టాఫ్ తీవ్రమైన కొరత ఉంది. 60 శాతం కన్నా ఎక్కువే ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. మొత్తం ఆనాటి అవసరాలకు అనుగుణంగా 2824 అధ్యాపకుల్లో సగానికి పైగా 1633 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. అధ్యాపకులు లేకుంటే విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎక్కడ నుంచి అందుతుంది. దీంతో డిగ్రీలు పూర్తి చేసినా వారికి స్కిల్స్ లేక ఉద్యోగాలు పొందలేకపోతున్నారు. ప్రొఫెసర్లు లేకపోవడంతో యూనివర్సిటీల్లో పరిశోధనలు



భూ ప్రపంచం మన మాతృభూమి – సమస్త మానవాళీ మన జాతి. – శ్రీ వీర సావర్కార్



'చలో అసెంబ్లీ'కి బయలుదేరిన బిజెపి నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

నిలిచిపోయాయి. పీహెచ్‌డీ ప్రవేశాలే చేపట్టడం లేదు. ఇక నాన్‌టీచింగ్ స్టాఫ్ సంగతి సరేసరి. ప్రాథమిక విద్య నుంచి యూనివర్సిటీ వరకు.. అన్నింటా ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. మూడున్నర ఏళ్లలో ఒక్క ఖాళీ కూడా భర్తీ చేయలేదు.

అటు కాంట్రాక్ట్ టీచర్లను, లెక్చరర్లను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి పాలాభిషేకాలు అయితే బాగానే చేసుకున్నారు కానీ అది కూడా నీటి మీది రాతగానే తేలింది. కాంట్రాక్టు టీచర్ల ఆందోళనలపై అణచివేతలకు పాల్పడు తున్నారు. ఎయిడెడ్ కాలేజీల్లోనూ లెక్చరర్ల కొరత తీవ్రంగా వేధిస్తుంది. ఆయా కాలేజీల్లోని టెంపరరీ లెక్చరర్లు 1994 నుంచి ఇప్పటికీ టెంపరరీగా ఉన్నారు. హైదరాబాద్ సిగ్నోడియా కామర్స్ కాలేజీలో అయితే 475 మందికి ఒకే ఒక్క అధ్యాపకుడు ఉన్నారు. ఇలా అయితే రాష్ట్రంలో యువతకు నాణ్యమైన విద్య ఎలా అందుతుంది.

### ఉపాధి కల్పన

తెలంగాణ నెంబర్ వన్ రాష్ట్రం.. కుప్పలు తెప్పలుగా పెట్టుబడులు వస్తున్నాయి.. కొత్తకొత్త కంపెనీలు వస్తున్నాయి అంటున్నారు.. ఇప్పటివరకు రాష్ట్రంలో ఎన్ని కంపెనీలు వచ్చాయి. ఈ కంపెనీలు కొత్తగా ఎన్ని ఉద్యోగాలు సృష్టించాయి. ఆపిల్ కంపెనీ వస్తుందన్నారు. అది ఇప్పుడెందుకు బెంగ ళూరుకు తరలి పోయిందిం? తెలంగాణకు ఎందుకు రాలేదు? దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలి. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ప్రైవేటు రంగంలో, ప్రభుత్వం రంగంలో కొత్త ఉద్యోగాలు ఎన్ని వచ్చాయో ప్రభుత్వ శ్వేతపత్రం విడుదల చేయాలి..!

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతో తెలంగాణలో ఎమ్.ఎస్.ఎమ్.ఈ సెక్టర్ ఆందోళనకరంగా ఉంది. అవి మూతపడే స్థితికి చేరుకున్నాయి. దీంతో ప్రైవేటు సంస్థల్లో లేఆఫ్‌లు రోజుకు రోజుకు పెరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఉద్యోగాలు సృష్టించడం అటుంచితే ఉన్న ఉద్యోగాలు కాపాడలేకపోతుంది. ప్రైవేటు సంస్థల నియామకాల్లో తెలంగాణ అట్టడుగున ఉండడం ఉద్యోగ కల్పనపై ఈ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో అద్దం పడుతుంది.

రాష్ట్రం ఏర్పడక ముందే హైదరాబాద్ ఐటీ

> **ఐటీ రంగంలో దేశవ్యాప్తంగా ఉన్న ఓపెనింగ్స్‌లో తెలంగాణ వాటా కేవలం 3.47 శాతం మాత్రమేనని ఓ సంస్థ చేపట్టిన సర్వేలో వెలుగు చూసింది. ఇది సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయం. ఐటీ కంపెనీలను రప్పించి.. యువతకు కొత్త ఉద్యోగాలు ఇప్పించడంలో ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది.**

క్యాపిటల్‌గా పేరుపడింది. అటు ప్రభుత్వం కూడా ఐటీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్తోంది. ఐటీ రంగాన్ని తెలంగాణ మొత్తం విస్తరించేలా చేస్తామని.. హైదరాబాద్‌ను నెంబర్ 1 చేస్తామంటున్నారు. కానీ వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తి విరుద్ధంగా ఉంది. ఐటీ రంగంలో దేశవ్యాప్తంగా ఉన్న ఓపెనింగ్స్‌లో తెలంగాణ వాటా కేవలం 3.47 శాతం మాత్రమేనని ఓ సంస్థ చేపట్టిన సర్వేలో వెలుగు చూసింది. ఇది సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయం. ఐటీ కంపెనీలను రప్పించి.. యువతకు కొత్త ఉద్యోగాలు ఇప్పించడంలో ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. తెలంగాణలో గతంలో వందల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ జరిగేవి. ఇప్పుడు పదుల సంఖ్యలో కూడా నియామకాలు జరగడం లేదు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ లేక కాలేజీలు వెలవెలబోతున్నాయి. ఆటోమేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా ఐటీలో కొత్త ఉద్యోగాలు తగ్గిపోతున్నాయి. ఇప్పటికే ఉద్యోగం చేస్తున్నవారు తమ జాబులు ఉంటాయో.. ఊడతాయో తెలియని అభద్రతాభావంలో కొట్టుమిట్టాడుతున్నారు. సాంకేతికరంగంలో మార్పులను అందిపుచ్చుకోవడంలో మన విద్యావ్యవస్థ వెనుకబడటమే ఇంజినీరింగ్ విద్యార్థులు వెనకబడటానికి ప్రధాన కారణంగా తెలుస్తుంది. మార్కెట్‌కు తగ్గట్టు పాఠ్యాంశాల్లో మార్పులు ఉండటం లేదు. ప్రస్తుతం కాలేజీలో చదివే పాఠ్యాంశాలు బయటకు వచ్చేసరికి ఔట్‌డేట్ అవుతున్నాయి. నాణ్యమైన బోధకులు లేరు. అటు ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో సాఫ్ట్‌వేర్ ఎంట్రీ లెవల్ జాబ్స్ తగ్గిపోతున్నాయి. ఎమ్మెన్సీలు డాటా ఎంట్రీ, కాల్ సెంటర్, డాక్యుమెంట్ ప్రాసెస్ పనులకు ఉద్యోగులకు బదులు ప్రోగ్రామింగ్ ఆటో మేషన్‌నే వినియోగిస్తున్నారు. దీంతో ఈ రంగాల్లో ఉద్యోగాలకు అవకాశం లేకుండా పోతోంది. 2021 నాటికి దేశంలో 4.80 లక్షల ఉద్యోగాలు పోతాయని ఇటీవలే ప్రపంచబ్యాంకు హెచ్చరించింది. ఇందులో ఎక్కువ నష్టపోయే దేశాలు చైనా, భారత్‌లేనని స్పష్టం చేసింది. మారుతున్న టెక్నాలజీలో నైపుణ్యత సాధించిన వారికే కొలువులు వస్తున్నాయి. మన రాష్ట్రంలో ఆటోమేషన్ సవాల్‌ను ఎదుర్కోగలిగే నైపుణ్యం కేవలం 12 శాతం మందికే ఉన్నట్టు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాబోయే ప్రమాదాన్ని ముందే పసిగట్టి రాష్ట్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయాలి. లేకుంటే ఐటీతో కొత్త ఉద్యోగాలు కాదు కదా.. ఉన్న ఉద్యోగాలు పోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఓ వైపు ప్రతి ఏడాది వేలు, లక్షల సంఖ్యలో ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు చదువులు పూర్తి చేసుకొని ఉద్యోగాలకై ఆశగా చూస్తున్నారు. మరోవైపేమో కొత్త ఉద్యోగాలు తగ్గిపోతు న్నాయి. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రమైతే దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి.

అటు రాష్ట్రంలో ఉపాధి కల్పన కార్యాలయాలు ఆధునీకరణకు దూరంగా

ఉన్నాయి. ఆన్‌లైన్‌లో సమాచారం లేదు. ఈ కార్యాలయాలు నిరుద్యోగులకు చేయూత నివ్వడం లేదు. అటు జార్ఖండ్, ఉత్తరాఖండ్, మేఘాలయా లాంటి చిన్న రాష్ట్రాలు ఆన్‌లైన్ వ్యవస్థతో నిరుద్యోగులకు అండగా నిలుస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం ఇవి అలంకార ప్రాయంగా మిగిలిపోయాయి. ఒక్క నోటిఫికేషన్ ఇస్తే, 14 లక్షల మంది దరఖాస్తు చేస్తున్నారు. దీనిని బట్టి మన రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

### కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు

రాష్ట్ర ప్రభుత్వం ఎలాగూ ఉద్యోగాలు కల్పించలేకపోతుంది. కనీసం కేంద్ర ప్రభుత్వ రంగంలోని జాబులపై అయినా నిరుద్యోగులకు అవగాహన కల్పిస్తుందా అంటే.. అదీ లేదు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఏటా లక్షకు పైగా ఉద్యోగాలు భర్తీ అవుతాయి. ఒక్క స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్.ఎస్.సీ) ద్వారానే కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాల్లో 50 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తుంది. అయితే ఈ ఉద్యోగాల్లో తెలంగాణకు దక్కుతుంది మాత్రం నామమాత్రం. కనీసం 5 శాతం ఉద్యోగాలను కూడా తెలంగాణ యువత దక్కించుకోలేకపోతుంది. అవగాహనరాహిత్యం, అపోహల కారణంగా ఇక్కడి నిరుద్యోగులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలపై దృష్టి సారించడం లేదు.

2014-15లో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా 57,542 మంది ఎంపికైతే అందులో తెలంగాణ నుంచి ఉద్యోగాలు పొందినవారు వెయ్యి లోపే అనేది ఓ అంచనా. దీనిని బట్టి తెలుస్తుంది కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాల్లో మనవాటా ఎంత తక్కువ ఉందో..? ఇప్పటికైనా ప్రభుత్వం ఈ దిశగా తగిన చర్యలు చేపట్టాలి. రాష్ట్ర నిరుద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలపై అవగాహన కల్పించాలి. 2018లో రైల్వేలు, కేంద్ర పోలీసు విభాగాలు భారీ ఎత్తున నియామకాలు చేపట్టనున్నాయి. సుమారు మూడున్నర లక్షల కొలువులను భర్తీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువతను సిద్ధం చేసేందుకు ఇప్పటికే కసరత్తు మొదలు పెట్టాలి. తర్ఫీదు ఇవ్వాలి.

### ముద్రా

పేదలు, దళితులు, బడుగులు, మహిళలు ఉద్యోగార్థులుగానే ఉండకూడదు.. వారు ఉద్యోగాలిచ్చే స్థితికి చేరాలన్న ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని మోదీ ప్రభుత్వం ముద్రా యోజన, స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా లాంటి పథకాలు ప్రవేశపెట్టి వారికి ఆర్థిక చేయూతనిస్తుంది. వాటి ఫలితాలు తెలంగాణలోనే కాదు... దేశవ్యాప్తంగా కనిపిస్తున్నాయి. ముద్రా కింద సుమారు 8కోట్ల 50లక్షల మందికి రుణాలు మంజూరు చేశారు. దాదాపు 3.5 లక్షల కోట్లు రుణ వితరణ చేశారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకే 67 శాతం రుణాలు లభించాయి. మహిళలకు లభించిన రుణాలు 79 శాతం, మైనార్టీలకు వచ్చిన రుణాల్లో 13 శాతం. అటు స్టాండప్ పథకంలోనూ 5827 మంది ఎస్సీలకు, 1747 ఎస్టీలకు, 33142 మంది మహిళలకు కలిపి మొత్తం 40,716 రుణాలు మంజూరు చేశారు. ఈ రుణాలు పొందినవారు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకొని.. వారు లాభపడడమే కాకుండా కొత్త ఉద్యోగాలు సృష్టించి కొంతమందికి ఉపాధి కల్పించారు. ఆ విధంగా దేశాభివృద్ధికి చేయూత అందిస్తున్నారు, ప్రధాని నరేంద్ర మోదీ గారు.

**దివ్యాంగులకు 339 ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడం శోచనీయం. పక్క రాష్ట్రం ట్రిబ్యునల్ జడ్జిమెంట్ ప్రకారం రాష్ట్రం విడిపోయిన తరువాత దివ్యాంగులకు 5 శాతం ఉద్యోగాలిచ్చారు. ఇక్కడ మాత్రం ఉత్తచెయ్యే చూపించారు. బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసి, భర్తీ ప్రక్రియలో 5 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి.**

దేశంలో ఇలా ఉంటే మన రాష్ట్రంలో మాత్రం బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లు మార్జిన్ మనీ ఇవ్వలేని దుస్థితి నెలకొంది. బ్యాంకులు మంజూరు చేసినా ప్రభుత్వ వాటా లేదు. ఎంబీసీలకు రూ.1000 కోట్లు అన్నారు. కానీ ఇంతవరకు అతీగతీ లేదు. మొదటి జనరేషన్ డిగ్రీలు, పీజీలు పూర్తి చేసుకొని రుణాల కోసం ఎదురు చూస్తున్నారు.

సామాజిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రగతి ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు ప్రతిపాదించారు. అందుకోసం ఉద్యోగ కల్పనపై మార్గసూచి వేస్తూ, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి రూపకల్పన చేశారు. ఆర్థిక, ఆరోగ్య రంగాల్లో లక్ష్యాలు సాధించే రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించారు. అంత్యోదయ అమలుకు ప్రత్యేక విధానాలు అనుసరించాలని ప్రతిపాదించారు.

రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వం.. తమపై వస్తున్న విమర్శలను అధికారబలంతో అణగదొక్కేందుకు ప్రయత్నిస్తోంది. ఇటీవల సంజీవ అనే కండక్టర్ సోషల్ మీడియాలో 'ఆర్టీసీ నష్టపోతుంది.. ఆదుకోవాలంటూ' ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టు చేశారని అతన్ని సస్పెండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తిన ప్రతి గొంతునూ నొక్కేయాలని చూస్తున్నారు. రాష్ట్రంలో అప్రకటిత ఎమెర్జెన్సీ పరిస్థితులు నెలకొన్నాయి.

1998 డీఎస్సీలో నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేస్తామని గతంలో వరంగల్‌లో ఓసారి సీఎం హామీ ఇచ్చినా.. ఇప్పటివరకు ఆ హామీని నిలబెట్టుకోలేదు. 19 ఏళ్లుగా నాటి డీఎస్సీ అభ్యర్థులు న్యాయం కోసం పోరాడుతూనే ఉన్నారు. ఉద్యోగాల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. సీఎం హామీ ఇచ్చినా వారి కష్టాలు తీరేలా కనిపించడం లేదు.

సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల పాధ్యాయులు... కాంట్రాక్టు టీచర్లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తున్నారు.

### దివ్యాంగుల సమస్యలు

టీఆర్టీలో ప్రత్యేక బీఈడీ, డీఈడీ పట్టభద్రులైన అభ్యర్థులకు ఎందుకు అవకాశం ఇవ్వలేదు. పునరాలోచన చేసి వారికి అవకాశం కల్పించాలి. దీనిపై హైకోర్టు సైతం ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. వారి పట్ల మాకు పూర్తి సానుభూతి ఉంది. ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ప్రత్యేకంగా విద్యనభ్యసించిన వాళ్లను నియమించాలి.

దివ్యాంగులకు 339 ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడం శోచనీయం. పక్క రాష్ట్రం


సాధారణంగా విజ్ఞులు వింటారు, మేధావులు మాట్లాడుతారు, మూర్ఖులు వాదిస్తారు.

ట్రిబ్యునల్ జడ్జ్‌మెంట్ ప్రకారం రాష్ట్రం విడిపోయిన తరువాత దివ్యాంగులకు 5 శాతం ఉద్యోగాలిచ్చారు. ఇక్కడ మాత్రం ఉత్తచెయ్యే చూపించారు. బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసి, భర్తీ ప్రక్రియలో 5 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి.

### గల్ఫ్ బాధితుల వెతలు

పుట్టిన గడ్డపై సరైన ఉపాధి లేకపోవడంతో ఎంతోమంది తెలంగాణ బిడ్డలు కట్టుకున్న భార్యను, పిల్లలను వదిలి.. పొట్ట చేత పట్టుకొని.. ఉద్యోగం వెతుక్కుంటూ ఎక్కడో దూరంగా ఉన్న గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నారు. అక్కడ వారు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. ఎంతోమంది అనారోగ్యంతో, ప్రమాదాల బారిన పడి, మానసిక క్షోభతో బలవన్మరణానికి పాల్పడుతూ గల్ఫ్ దేశాల్లో మరణిస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో మరణించిన తెలంగాణ బిడ్డల మృతదేహాలు స్వదేశం చేరేందుకు నెలలు తరబడి ఎదురు చూడాల్సి వస్తుంది. కొన్నిసార్లు అయినవారి కడచూపునకు కూడా నోచుకోకుండా అక్కడే ఖననం చేస్తున్నారు.

తెలంగాణ ఏర్పడిన జూన్ 2, 2017 తర్వాత సుమారు 600కు పైగా వలస జీవులు గల్ఫ్ దేశాల్లో మృతి చెందినట్టు తెలుస్తుంది. వారిపైనే ఆధారపడిన ఇక్కడి కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో కూరుకుపోతున్నాయి. ప్రభుత్వం గల్ఫ్ బాధిత కుటుంబాల పట్ల సానుభూతితో వారికి 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాను.

ఇక ఏజెంట్ల బారినపడి మోసపోతున్న ముస్లిం యువతుల ఘటనలు ప్రతిరోజూ పతాక శీర్షికలవుతున్నాయి. ఇలా మోసపోతున్నవారిలో పాతనగరంలోని పేద కుటుంబాలకు చెందినవారే ఎక్కువగా ఉన్నారు. వీరంతా అరబ్ దేశాల్లో అష్టకష్టాలు పడుతున్నారు. అంతే కాదు... అరబ్ షేకుల కామదాహానికి ఇక్కడి మైనర్ బాలికలు బలవుతున్నారు. డబ్బుల కోసం ముస్లిం యువతులకు మాయమాటలు చెప్పి, మభ్యపెట్టి విదేశాలకు పంపిస్తున్న మధ్య వర్తులను, వారికి సహకరిస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముస్లిం సోదరీ



'చలో అసెంబ్లీ'కి బయలుదేరిన బిజెపి నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

మణులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది.

### టి–సెర్ప్ ఎంప్లాయిస్ యూనియన్

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ– సెర్ప్‌లో పనిచేస్తున్న 4264 మంది సర్వీసులను క్రమబద్ధీకరించాలి. క్రమబద్ధీకరణ కోసం వారు ఉద్యమిస్తున్నా ప్రభుత్వ పట్టించుకున్న పాపాన పోలేదు.

### ఐఈడీఎస్ఎస్ ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్య కోసం

స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి, అవసరాలకు అనుగుణంగా కొత్తగా ప్రత్యేక పాఠశాలలు తెరవాలి. కానీ ఈ ప్రభుత్వం ఉన్నవాటిల్లోనే పోస్టులను భర్తీ చేయక వారిపట్ల చిన్నచూపు చేస్తుండడం శోచనీయం.

### జీహెచ్ఎమ్సీ

జీహెచ్ఎమ్సీలో కమ్యూనిటీ ఆర్గనైజర్స్ వేతనాలు పెంచాల్సిన ఫైలు ముందుకు కదలడం లేదు. మహిళా సంఘాల నుండి అన్ని సేవా, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్న వీరికి కేవలం రూ.11,000 వేతనం ఇస్తున్నారు. అందులో వారి చేతికొచ్చేది 7వేల రూపాయలే. దీంతో ఎట్లా బతకాలో ముఖ్యమంత్రి గారు చెప్పాలి.

జీహెచ్ఎమ్సీలో చేపట్టిన ఎల్ఈడీ ప్రాజెక్టులో జీహెచ్ఎమ్సీ స్ట్రీట్‌లైట్స్ మెయింటనెన్స్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్‌కు అవకాశం కల్పించాలి. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ఈఈఎస్ఎల్ సంస్థకు అప్పజెప్పడంతో, వారు లోకల్ కాంట్రాక్టర్లకు, వారు సబ్ కాంట్రాక్టర్లకు ఇస్తున్నారు. దీంతో జీహెచ్ఎమ్సీలో 17 సంవత్సరాలుగా పనిచేస్తున్న 751 మంది ఔట్‌సోర్సింగ్ ఎలక్ట్రీషియన్స్‌పై ప్రభావం పడుతుంది. వారి కాంట్రాక్టు గడువు ఈ నెల 30కి ముగుస్తుండడంతో వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. వారి సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన పరిష్కారం చూపాలి.

### జర్నలిస్టు సమస్యలు

ఇవాళ జర్నలిస్టులు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. వారికి ఉద్యోగ భద్రత లేదు. చాలామంది చాలీచాలని జీతాలతో గుట్టుగా నెట్టుకొస్తున్నారు. అసలు జీతాలే ఇవ్వని సంస్థలు ఎన్నో ఉన్నాయి. అయినా ప్రభుత్వం హామీలతోనే సరిపెడుతుంది కానీ వారి సంక్షేమం పట్ల గట్టి చర్యలు తీసుకుంటున్నట్టు కనిపించడం లేదు.

రాష్ట్రం ఏర్పడితే తమ సమస్యలు తీరుతాయని ఆశించిన వారందరికీ ఈ ప్రభుత్వం మొండిచేయే చూపిస్తుంది. ఉద్యమకారులు ఉద్యమపార్టీ అని నమ్మి ఓట్లు వేస్తే టీఆర్ఎస్ పార్టీ ప్రజలను వెన్నుపోటు పొడిచింది. ఏ విషయంలోనైనా ఓ స్త్రీ రేపు రా అన్న తరహాలో సీఎం కేసీఆర్ ఎప్పుడూ అవే మాటలు చెప్తూ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కానీ సమస్యను పరిష్కరించడం లేదు. ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదు. నిరుద్యోగ సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దింపేవరకు పోరాడుదాం. యువత తరఫున పోరాడుతున్న బిజెపిని బలోపేతం చేద్దాం. ■



నవంబర్ 11న మలక్‌పేటలో జరిగిన హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్, జిల్లా అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తదితరులు.



నవంబర్ 18న పరిగిలో జరిగిన వికారాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్, బద్దం బాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ప్రహ్లాదరావు తదితరులు



నవంబర్ 18 బిజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ప్రసంగిస్తున్న బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్ రావు, ఎంపీ బండారు దత్తాత్రేయ, బిజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జనగాం జిల్లా కార్యవర్గ సమావేశంలో బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు డా॥ నాగం జనార్ధన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కె.వి.ఎల్.ఎన్.రెడ్డి తదితరులు.




నవంబర్ 9న భూత్పూర్‌లోని అమిస్తాపూర్‌లోని మహబూబ్‌నగర్ జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మంత్రి శ్రీనివాసులు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోలి మధుసూదన్ రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు పద్మజా రెడ్డి, రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



నవంబర్ 10న గోపాల్‌పేట మండలంలో జరిగిన వనపర్తి జిల్లా కార్యవర్గ సమావేశంలో బిజెపి రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మంత్రి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి తదితరులు



నవంబర్ 13న వరంగల్ అర్బన్ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ నేతృత్వంలో సాగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఎం.ధర్మారావు, రఘునందన్ రావు, రాకేష్ రెడ్డి, మీసాల చంద్రయ్య తదితరులు.



నవంబర్ 9న మణుగురులో జరిగిన బిజెపి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రఘునందన్ రావు, జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, జిల్లా ఇంచార్జీ అమర్‌నాథ్ తదితరులు



ప్రభుత్వం ఏ పార్టీదైనా ప్రజల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలి. – దీన్‌దయాళ్జీ



సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం ఆకారం గ్రామంలో వివిధ పార్టీల నుండి బిజెపిలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రఘునందన్ రావు.



నవంబర్ 13న ఖమ్మంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా సాంబమూర్తి, బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సన్నె ఉదయ్ ప్రతాప్ ఆధ్వర్యంలో బిజెపిలో చేరిన గాజుల శ్రీనివాస్ రావు సహా 400 మంది కార్యకర్తలు.




రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని కోరుతూ నవంబర్ 4న వరంగల్ లో బిజెపి నాయకులు భారీ ర్యాలీ తీశారు. ఈ ర్యాలీలో వరంగల్ అర్బన్ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూర్తినేని ధర్మారావు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎనుగుల రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




తెలంగాణలో నిరుద్యోగ సమస్యలపై బీజేవైఎం ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ఆచారి, జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ అర్బన్ జిల్లా వంగపహాడ్ గ్రామంలో అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్న పత్తి కావులు రైతు ఐలయ్య కుటుంబాన్ని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి పరామర్శించి, రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.



బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్ నుంచి బిజెపి ఉపాధ్యాయ, ఉద్యోగుల మరియు పెన్షనర్ల సెల్ కన్వీనర్‌గా నియామకపత్రాన్ని అందుకుంటున్న పేరి వెంకట రెడ్డి.



నల్లధన వ్యతిరేక దినం పురస్కరించుకొని నవంబర్ 8న హైదరాబాద్ ఆనంద్‌బాగ్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి యాదవ్ తదితరులు.



'చలో అసెంబ్లీ' సందర్భంగా అక్రమ అరెస్టులను నిరసిస్తూ కామారెడ్డి జిల్లా బాన్సువాడలో టీఆర్ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసిన బిజెపి నాయకులు, కార్యకర్తలు.

వర్తమానం

# ఘనంగా నల్లధన వ్యతిరేక దినోత్సవం



"అనేక సూచీకలు దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతాన్ని చూపుతున్నా కాంగ్రెస్ నాయకులకు కనపడకపోవడం దురదృష్టకరం. ఇప్పటికైనా స్వార్థ రాజకీయాలు వదలి, పేద ప్రజల శ్రేయస్సుకోసం ఆర్థిక సంస్కరణలకు మద్ధతు ఇవ్వాలి."
-జి.కిషన్ రెడ్డి, బిజెపి శాసనసభ పక్షనేత

నవంబర్ 8, 2016... స్వతంత్ర భారతదేశ చరిత్రలో చారిత్రాత్మకమైన రోజు. నల్లధనం, అవినీతి, ఉగ్రవాదంపై పాశుపతాస్త్రం ఎక్కుపెడుతూ ప్రధాని నరేంద్ర మోదీ 500, 1000 రూపాయల నోట్లను రద్దు చేసిన విశిష్టమైన రోజు. ఒక్క దెబ్బకు మూడు పిట్టలు అన్నట్టు... దేశాన్ని సుదీర్ఘ కాలం పట్టిపీడిస్తున్న చీడపురుగులు నల్లధనం, అవినీతి, ఉగ్రవాదంపై గట్టి దెబ్బ తగిలింది. దీని ఫలితాలు ఇప్పటికే కనిపిస్తున్నాయి. దేశంలో టాక్స్ కట్టేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. డిజిటల్ పేమెంట్స్ పెరిగాయి. రుణాలు సులువుగా లభిస్తున్నాయి. స్థానిక సంస్థల ఆదాయం పెరిగింది. మొత్తానికి పెద్ద నోట్ల రద్దు విప్లవాత్మకమైన ప్రయోజనాలు చేకూరుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశం ఈ నవంబర్ 8న 'అవినీతి వ్యతిరేక దినం'గా జరుపుకొంది.

-జనసందేశ్ ప్రతినిధి



"కాంగ్రెస్, కమ్యూనిస్టులు అవినీతి, అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతున్నారు. ప్రజలు వారి కుయుక్తులను తిప్పికొడతారు."
-ఎన్.రాంచందర్ రావు, శాసనమండలి పక్షనేత

## నోట్లరద్దు ప్రజల విజయం



అవినీతి, నల్లధనంపై పోరులో భాగంగా ఏడాది క్రితం ప్రకటించిన పెద్ద నోట్ల రద్దు భారతీయులు సాధించిన ఘన విజయంగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఈ గెలుపు దేశంలోని 125 కోట్ల మందిదని పేర్కొన్నారు. సాహసోపేతమైన నోట్ల రద్దు నిర్ణయానికి మద్దతుగా నిలిచినందుకు వారందరికీ వినమ్రంగా నమస్కరిస్తున్నానని తెలిపారు. ఆర్థిక వ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా చేపట్టిన క్రమబద్ధీకరణ చర్యల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ గాడినపడిందని, నిరుద్యోగులకు మంచి ఉద్యోగాలు రానున్నాయని ఆశాభావం వ్యక్తంచేశారు.

## మోదీకి మద్దతుగా నిలుద్దాం



'నల్లధన వ్యతిరేక దినం' పురస్కరించుకొని గుజరాత్‌లోని జునాగఢ్‌లో నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా పాల్గొన్నారు. అవినీతి, నల్లధనం లేని సరికొత్త భారత దేశం ఆవిష్కరణకు ప్రధాని మోదీ కొనసాగిస్తున్న కృషికి ప్రతి ఒక్కరం మద్దతుగా నిలవాలని కోరారు. నోట్ల రద్దును వ్యతిరేకిస్తూ విపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు.

## నల్లధనంపై బహిరంగ చర్చకు రావాలి



పెద్దనోట్లను రద్దుచేసి ఏడాదైన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన 'నల్లధనం వ్యతిరేక దినం'లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి అనంత్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నల్లధనంపై బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీకి సవాలు విసిరారు. పదేళ్ల యూపీఏ ప్రభుత్వాన్ని సోనియా గాంధీ, రాహుల్ గాంధీ తెర వెనుక నుంచి నడిపించారని.. వారి హయాంలో రూ.12 లక్షల కోట్ల కుంభకోణాలు జరిగాయని, అదంతా నల్లధనమేని ధ్వజమెత్తారు. దేశం నుంచి నల్లధనాన్ని పారదోలడానికే నరేంద్రమోదీ ప్రభుత్వం పెద్దనోట్లను రద్దుచేసిందని.. దీంతో వస్తున్న ప్రయోజనాల్ని ప్రజల సంక్షేమానికే ఖర్చుపెడతామని చెప్పారు. నల్లధనం కోల్పోయిన వారే 'బ్లాక్‌డే' పేరుతో నిరసన పాటిస్తున్నారని విమర్శించారు. కేంద్రం తీసుకున్న చర్యలతో విదేశాల నుంచి ఇప్పటికే 50-60 వేల కోట్ల రూపాయల నల్లధనం వెనక్కి వచ్చిందన్నారు. రామగుండంలో ఎరువుల కర్మాగారం పనులు పురోగతిలో ఉన్నాయని అనంత్‌కుమార్ తెలిపారు. 2019లో ఎప్పుడైనా ఈ కర్మాగారాన్ని ప్రారంభిస్తామన్నారు. త్వరలో ఈ కర్మాగారాన్ని పరిశీలిస్తానన్నారు.

## కాంగ్రెస్, కమ్మీలది గోబెల్స్ ప్రచారం



కాకులు, గద్దల్లా అరుస్తూ గోబెల్స్ ప్రచారం చేస్తున్న కాంగ్రెస్, కమ్యూనిస్టు మాటలను ప్రజలు విశ్వసించడం లేదని కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ బండారు దత్తాత్రేయ అన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పారని, ఈ రోజు వారికే బ్లాక్‌డేగా మారుతుందని అన్నారు. నోట్లరద్దు తర్వాత అనేక లాభాలు కలిగాయని ఏడు కోట్లమంది ప్రజలకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరిందని, వడ్డీరేట్లు తగ్గాయని అన్నారు. ఇది డీమానిటైజేషన్ మాత్రమే కాదని, రీమానిటైజేషన్ కూడా అని దత్తాత్రేయ అన్నారు. దేశ ఆర్థిక రంగాన్ని బాగుచేయడానికి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్న ప్రధాని నరేంద్ర మోదీకి ప్రజలు మద్దతు తెలిపాలని అభ్యర్థించారు.

## ప్రజల విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్, కమ్యూనిస్టులు



పెద్దనోట్లను రద్దు చేస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయాన్ని ప్రపంచ దేశాలు స్వాగతిస్తే కాంగ్రెస్, కమ్యూనిస్టులు మాత్రం బురదజల్లే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్ విమర్శించారు. దేశ ప్రజలు కాంగ్రెస్, కమ్యూనిస్టులను నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. నల్లధన నిర్మూలనకు నరేంద్ర మోదీ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. నల్ల కుబేరుల ఆటలు కొనసాగకుండా అనేక విప్లవాత్మక చర్యలు చేపడుతుంటే ప్రతిపక్ష పార్టీలు బ్లాక్ డేగా పరిగణించి వారి రాజకీయ దివాళాకోరుతనాన్ని బయటపెట్టుకున్నాయని దుయ్యబట్టారు.

ప్రధాని గత మూడున్నర సంవత్సరాలుగా అవినీతిపై యుద్ధం చేస్తున్నారని, మొట్టమొదటి మంత్రివర్గంలోనే నల్ల కుబేరులపై చర్యలు తీసుకోవడానికి వీలుగా సిట్ నియమించారని, మనీ లాండరింగ్ నిర్మూలన చట్టం, బ్లాక్ మార్కెటింగ్ వ్యతిరేక చట్టం, బినామీ ఆస్తుల వ్యతిరేక చట్టం తెచ్చారని అన్నారు. సుమారు రెండు లక్షలకు పైగా నకిలీ కంపెనీల గుర్తింపు రద్దు చేశారని, ఇవన్నీ కాంగ్రెస్‌కు కనిపించడం లేదా అని డా॥ లక్ష్మన్ ప్రశ్నించారు.

పెద్దనోట్ల రద్దువల్ల ఉగ్రవాదం, నక్సలిజం తగ్గిందని, నకిలీనోట్ల బెడద లేకుండా పోయిందని, 3.89 లక్షల కోట్ల డబ్బు చలామణి తగ్గిందని, 15.28 లక్షల కోట్లు చలామణిలోకి వచ్చిన డబ్బు అంతా ఎవరిదో తెలిసిందని తెలిపారు. అనుమానాస్పద ఖాతాల్లోకి వచ్చిన రూ. 1.70 లక్షల కోట్లపై విచారణ కొనసాగుతుందని గణాంకాలతో సహా వివరించారు.

కాంగ్రెస్ అవినీతిలో కూరుకుపోయిందని.. ఎ అంటే ఆదర్శ్, బి అంటే బోఫోర్స్, సి అంటే కోల్... యూపీఏ పాలనలో ఒక్కో అక్షరానికి ఒక్కో స్కాం బయటపడిందన్నారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే నోట్లరద్దు లాభాలపై చర్చకు రావాలని సవాల్ విసిరారు.

దేశంలో నగదు రహిత లావాదేవీలపై ప్రజలను జాగృతం చేయాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో పేద ప్రజలకు లబ్ధి చేకూరే పథకాలు కొనసాగుతున్నాయని, అవినీతిరహిత పాలన సాగుతుందని అన్నారు.



ప్రతి హిందువూ హిందూ దేశ చరిత్ర చదివి తీరాలి. - మహాత్మాగాంధీ

భావ పరివర్తన చాలదు, హృదయ పరివర్తన కావాలి. - శ్రీ దత్తోపంత్ ఠెంగ్డే

ఏకాత్మత

# మనిషి సమగ్ర పురోగతి సాధనాలు!

● శివరాం

దేహము, మనస్సు, బుద్ధి, ఆత్మల సమగ్ర రూపం మనిషి అనే భారతీయ ఆలోచనకు భిన్నంగా పాశ్చాత్యులు వీటిని విడివిడిగా విడిగాను, మిగిలిన వాటితో దేనికీ సంబంధం లేనట్లుగా ఆలోచించడం వల్లనే తికమక ఏర్పడింది.

### మనిషి రాజకీయ ఆకాంక్షలు

ప్రజాస్వామ్య వ్యవస్థ గురించిన ఉద్యమం సాగే రోజుల్లో వారు "మనిషి ఓ రాజకీయ జీవి" అని ప్రకటించారు. అతని రాజకీయ ఆకాంక్షలను నేరవేర్చాలి. రాజుగా ఒక్కడే ఉండి, మిగిలిన వారంతా అతనికి లోబడి ఎందుకుండాలి? అందరం పరిపాలిద్దాం! ఈ రాజకీయ మానవుని తృప్తి పర్చడం కోసం వారు అతనికి ఓటు హక్కు ఇచ్చారు. ఇప్పుడతనికి ఓటు వేసే హక్కు వచ్చింది కానీ మిగతా హక్కులన్నీ క్షీణించాయి. ఓటు హక్కు బాగుంది, మరి బువ్వో? తినడానికి ఏమీ లేకపోతే ఎలా? అనే ప్రశ్న ఉదయించింది. వాళ్ళు ఆశ్చర్యపోయారు. "ఇప్పుడు నీకు ఓటు హక్కుంది. నువ్వే రాజువి. దిగులు పడతావెందుకు?", "తిండి దొరక్కపోతే ఈ రాజ్యాధికారాన్ని నేనేమి చేసుకోను?" ఈ ఓటు వల్ల నాకేమీ ప్రయోజనం లేదు. నాకు ముందు రొట్టె కావాలి అన్నాడు మనిషి.

అప్పుడు కారల్ మార్క్స్ "నిజమే! రొట్టె చాలా ముఖ్యమైనది. ఈ రాజ్యం ఉన్న వాళ్ళది. కనుక మనం రొట్టె కోసం పోరాడుదాం" అన్నాడు. రొట్టె కోరుకునే శరీరంగానే ఆయన మనిషిని చూశాడు. అయితే మార్క్స్ మార్గాన్ని అనుసరించిన వారు తమకు ఓటు హక్కు, రొట్టె రెండూ లేకుండా పోయాయని తెలుసు కున్నారు.

దీనికి వ్యతిరేక దిశలో అమెరికా ఉంది. అక్కడ రొట్టె, ఓటు హక్కు రెండూ ఉన్నాయి. ఐనప్పటికీ అక్కడ శాంతి, ఆనందాల కొరతే. అమెరికాలో ఆత్మహత్య చేసుకుంటున్న, మానసిక రోగుల సంఖ్య ఎక్కువ. చాలా మంది నిద్రపట్టక మత్తు మందులు ఉపయో గిస్తున్నారు. ఈ నూతన పరిస్థితుల్లోని సమస్యకు కారణం ఏమిటో ప్రజలకు అర్థం



కావడం లేదు. మనిషికి రొట్టె ఉంది, ఓటు హక్కుంది, అయినా శాంతి లేదు, ఆనందం లేదు. ఇప్పుడు వాళ్ళు మా ప్రశాంతమైన నిద్ర మాకు కావాలి అంటున్నారు. చెదరని గాఢ నిద్ర అమెరికాలో ఇవాళ్టి రోజున కరవైంది. ఎక్కడో ప్రాథమికంగా పొరపాటు జరిగిందని, దానివల్లే జీవితానికి కావలసినవి అన్నీ సమకూరినా సంతోషంగా లేమని ఆలోచనా పరులు గ్రహిస్తున్నారు. **(కేవలం ఆర్థికాధారిత పరిష్కారాలు విశ్వమానవాళి సంక్షేమానికి, శాంతి సాధనకు సరిపోవని బ్లూవేల్ ప్రేరేపిత ఆత్మహత్యలు, అమెరికాలో ఈనాడు రోజు రోజుకూ పెచ్చుమీరుతున్న లాస్‌వేగాస్ తరహా ఉన్మాద హత్యలు దీనదయాళ్‌జీ ప్రవచిత సిద్ధాంతం సత్యమని నిరూపిస్తున్నాయి కదూ!).** సమగ్రమైన మనిషి గురించి ఆలోచించక పోవడమే అసలు లోపం.

మన దేశంలో ఈ విషయాన్ని మనం ఆమూలాగ్రం పరిగణించాం. అందువల్లే మనిషి ప్రగతిని శారీరక, మానసిక, బౌద్ధిక, ఆత్మల సమగ్ర పురోగతి అని మనం అన్నాం. కేవలం ముక్తి గురించే భారతీయ సంస్కృతి ఆలోచిస్తుందని, మిగతా వాటి గురించి అది పట్టించుకోదనే ప్రచారం ఉంది. ఇది తప్పు. మనం ఆత్మ గురించి ఆలోచించక పోలేదు కాని శరీరము, మనస్సు, మేధస్సుల గురించి మనం పెద్దగా పట్టించుకోలేదు అనడం నిజం కాదు. ఇతరులు శరీరానికే ప్రాధాన్యతను ఇచ్చారు. అందువల్ల ఆత్మకు ఏకైక ప్రాధాన్యత మనదే అయ్యింది. దీంతో మనిషిలోని ఇతర అంశాలకు కాక కేవలం ఆత్మకే మనం ప్రాధాన్యత ఇస్తాము అనే ముద్ర మనకు పడ్డది.

అవివాహితుడైన యువకుడు తన తల్లి పట్ల శ్రద్ధ వహిస్తాడు. కాని పెళ్ళయ్యాక అతను తల్లి, భార్య ఇరువురి పట్ల శ్రద్ధ చూపుతాడు. ఇద్దరి పట్లా తన బాధ్యతలను నెరవేరుస్తాడు. ఇప్పుడు ఎవరైనా అతనికి తల్లి పట్ల ప్రేమ లేదని చెపితే అది నిజం కాబోదు. భార్య మొదట్లో భర్తను ప్రేమిస్తుంది. కాని సంతానం కలిగాక ఆమె భర్తను, పిల్లల్ని ఇద్దర్నీ ప్రేమిస్తుంది. కొన్ని సార్లు పిల్లలు పుట్టాక తన భార్య తనను నిర్లక్ష్యం చేస్తున్నది అని మతిలేని భర్త అనుకుంటాడు. సర్వ సాధారణంగా ఇది నిజం కాదు. అదే నిజమైనట్లయితే ఆ భార్య తన కర్తవ్య నిర్వహణలో తప్పక పొరపడినట్లే. అలాగే ఆత్మ గురించి శ్రద్ధ వహించవలసి వచ్చినప్పుడు మనం శరీరాన్ని నిర్లక్ష్యం చేయం. బలహీనుడు ఆత్మను తెలుసుకోలేడని ఉపనిషత్తులు నిర్ద్వందంగా ప్రకటించాయి. ధర్మంతో కూడిన కర్తవ్య నిర్వహణలో కూడా శరీరమే ప్రాథమిక పరికరం. మనకూ పాశ్చాత్యులకూ గల మౌలిక భేదం అది. శరీరము, దాని కోరికలను సంతృప్తి పరచడం లక్ష్యంగా వారు భావిస్తే మన లక్ష్యాల సాధనకు శరీరాన్ని ఉపకరణంగా మనం భావించాం. శరీరం యొక్క ప్రాధాన్యతను మనం ఈదిశగానే గుర్తించాం.

శారీరిక అవసరాలను తృప్తి పర్చడం అవసరమే కాని మన కృషికి అదే ఏకైక లక్ష్యమని మనం అనుకోలేదు. భారతీయులం అయిన మనం మనిషి సమగ్ర పురోగతి సాధించాలని భావించాం. మనిషిలో శరీరము, మనస్సు, బుద్ధి, ఆత్మలను తృప్తి పరచేందుకు నాలుగు బాధ్యతలను మన ముందు నిల్పుకున్నాం. వాటిని ధర్మ, అర్థ, కామ, మోక్షములనే చతుర్విధ పురుషార్థములు అన్నారు. పురుషార్థములు అనగా మానవునికి మేలు చేసే ప్రయత్నాలు. ■



జీవితమనే యుద్ధరంగంలో ధైర్యంగా పోరాడే సైనికుని శక్తి, స్ఫూర్తి మనకిప్పుడు కావాలి. - స్వామి వివేకానంద

సంస్మరణ

# దీన్‌దయాళ్ ఉపాధ్యాయ: నా హీరో

**1977 సెప్టెంబర్ 25న దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జన్మదిన వేడుకల సందర్భంగా అప్పుడు సమాచార శాఖ మంత్రిగా ఉన్న ఎల్.కె.అద్వానీ ప్రసంగం ఆధారంగా...**


**లాల్‌కృష్ణ అద్వానీ**
బిజెపి అగ్రనేత




ఎవరు ఎంత గొప్పవారైనా వారి సన్నిహితుల దృష్టిలో వీరులు కారు. ఎందుకంటే సన్నిహితులుగా మెలిగే వారికి ఆ గొప్పవారిలో లోపాలు కూడా తెలిసే అవకాశం ఉంటుంది. గొప్పవాళ్లను సన్నిహితంగా గమనిస్తే వారిలో అంత గొప్పతనం కనిపించకపోవచ్చు. కాని పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయను సన్నిహితంగా గమనించిన మా బోటి వారికి ఏమనిపిస్తుంది? ఆయన గురించి ఆలోచించిన కొద్దీ ఆయనలో మరింత గొప్పతనం కనిపిస్తుంది.



### వినమ్రతలోనే గొప్పతనం

నిరాడంబరంగా ఉండే దీన్‌దయాళ్ గొప్పతనాన్ని చాలామంది గుర్తించగలిగే వారు కాదు. జనసంఘ్ ప్రధాన కార్యదర్శి అయిన తర్వాత ఆయన చిత్రాలు పత్రికలలో వచ్చేవి. అయినా జనం ఆయనను గుర్తుపట్టేవారు కాదు. ఆయనను చూడని వారు ఆయనను తీసుకు రావడానికి రైల్వే స్టేషన్‌కు వెళ్లి ఎంత వెతికినా కనిపెట్టలేక పోయేవారు. అప్పుడు నిరాడంబ రంగా ధోవతి కట్టుకున్న ఓ వ్యక్తి వచ్చి, “మీరు దీన్‌దయాళ్ కోసం వెతుకుతూ ఉంటే అది నేనే” అనేవారు.

“చితి” అన్న వ్యాసం చదివిన తర్వాత ఆయనది అరుదైన వ్యక్తిత్వం అని, మౌలికమైన ఆలోచనాపరుడని అనిపించింది. కాని నేను ఆయనను కలుసుకున్నప్పుడు ఇంత నిరాడంబ రుడు ఇంత గొప్ప తాత్త్విక ధోరణి ఉన్న వారా అనిపించింది. ఆయనను సన్నిహితంగా ఎరిగిన తర్వాత అసాధారణమైన వ్యక్తి అనిపించింది. ఆయనను చూసిన తర్వాత నిజంగా మహా మనిషి అనిపించింది. ఆయన వ్యక్తిత్వంలో ఏ లోపమూ ఉండేది కాదు. సామాజిక కార్యకర్తలు ఎలా ఉండాలి అనడానికి ఆయన నిలువెత్తు నిదర్శనం. అంకితభావం ఉన్న సామాజిక కార్యకర్తలు ఎలా ఉండాలో ఆయనను చూసి నేర్చుకోవాల్సిందే. సామాజిక జీవనంలోనే కాకుండా వ్యక్తిగత జీవితంలో కూడా ఆయనే మొదట గుర్తొస్తారు.

మనుషులు ఈ విశ్వానికి తామే కేంద్ర బిందువు అనుకుంటారు. సామాజిక జీవితంలో ఈ ధోరణి ఇంకా అనేక రెట్లు ఎక్కువ కనిపిస్తుంది. దీన్‌దయాళ్ జీవితంలో ఈ అహంభావం ఉండేది కాదు. దీన్‌దయాళ్ జీ దేశమంతటా తిరిగే వారు. అనేక అంశాలపై దీర్ఘంగా ఆలోచించే వారు. తన ఆలోచన లన్నింటినీ రాసి పెట్టాలని మేం కోరేవాళ్లం. వాటిని ప్రచురించాలనే వాళ్లం. అనాసక్తంగానే రైళ్లో ప్రయాణిస్తున్నప్పుడు తన ఆలోచనలను అక్షరబద్ధం చేశారు. ఈ ఆలోచనలను రాయడానికి ఆయన సాధారణంగా నెమ్మదిగా వెళ్లే రైళ్లల్లో ప్రయాణించే వారు.

### ఆచరణవాది

కాలికట్‌లో జనసంఘ్ మాహాసభకు అధ్యక్షత వహించినప్పుడు ఆయన చెప్పిన మాటలు చాలా విలువైనవి. ఆయన భాష గురించి మాట్లాడినప్పుడు ఇతరుల వాదనకు భిన్నంగా ఉండేది. ఆయన దేశమంతటినీ దృష్టిలో పెట్టుకుని మాట్లాడే వారు. ఇందులో ఆయన ఆచరణవాదిగా ఉండేవారు. “నేను మలయాళీలతో మాట్లాడాల్సి వచ్చినప్పుడు నాకు మలయాళం రానప్పుడు, ఎదుటి వ్యక్తికి హిందీ తెలియనప్పుడు ఇద్దరికీ అర్థమయ్యే ఇంగ్లీషులో మాట్లాడితే పోయేదేముంది? నేను హిందీలోనే మాట్లాడతాననీ, ఎదుటి వ్యక్తి మలయాళంలోనే మాట్లాడతానని పట్టుబడితే మాట్లాడుకునేది ఏమీ ఉండదు” అనేవారు. ప్రజాస్వామ్యం మీద దీన్‌దయాళ్‌కు ఉన్న విశ్వాసం మా బోటి వారికి చక్కని పాఠం. 1975 జూన్‌లో ఎమర్జెన్సీ విధించినప్పుడు ‘ప్రజాస్వామ్యం అంతరించింది. మిగిలిందల్లా సంస్మరణ రాసుకోవడమే’ అన్నారు. “నియంత అయినా శాంతియుతంగా అధికారం వదులుకున్న సందర్భం ఉందా అని” నన్ను అడిగేవారు. అది అంత సులభం కాదు. నియంతను ప్రజాస్వామ్య పద్ధతిలో తొలగించి ప్రజాస్వామ్యాన్ని ప్రతిష్టించిన సందర్భం కూడా లేదు అన్నాను. నియంతను పదవీచ్యుతుడిని చేసేది మరో నియంతే. అందుకే ఓర్పు వహించాలని లాఘవం ప్రదర్శించాలని చెప్పేవాడిని. ఒకరోజు హఠాత్తుగా ఎన్నికలు జరుగుతాయని ప్రకటించారు. విషయ ప్రసారానికి అడ్డు తగిలి ప్రజల పీక నొక్కడానికి ప్రయత్నిస్తే ప్రజలే కాక అధికారంలో ఉన్న వారూ నష్టపోవాల్సిందే.

### సామాన్యుడి మీద విశ్వాసం

ఎమర్జెన్సీలో 19 నెలల పాటు ఏకపక్ష ప్రచారం కొనసాగించినా అవకాశం రాగానే ప్రజలు వారిని ఓడించారు. ఇది ప్రజల పరిణతి చెందిన అభిప్రాయానికి ప్రతీక. ఈ జనాభిప్రాయం మీద దీన్‌దయాళ్‌కు అపారమైన విశ్వాసం ఉండేది. సామాన్యులకు, మారుమూల గ్రామాల్లో ఉండేవారికి కూడా మంచేమిటో చెడేమిటో తెలుసునని దీన్‌దయాళ్ చెప్పేవారు. నగరాల్లో ఉండే వారికే అప్పుడప్పుడూ తెలియకుండా పోతుందనే వారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికలలో జనతా పార్టీ విజయం సాధించడానికి కేవలం జనతా ప్రభంజనమే కారణం కాదు. జనం నిర్ణయం కూడా కారణమే.

ఎన్నికల ప్రణాళికలో చెప్పిన అంశాలను అమలు చేయడానికే మనందరం కట్టుబడి ఉన్నాం. ఈ విషయంలో మహాత్మా గాంధీ, దీన్‌దయాళ్, లోహియా మనకు ఆదర్శం. ఇదే వరసలో లోకనాయక్ జయప్రకాశ్ నారాయణ్ కూడా ఆదర్శమే. మన కర్తవ్యం నెరవేర్చడానికి వీరి నుంచి స్ఫూర్తి పొందుదాం. వారిని ఆదర్శంగా తీసుకుని సామాజిక జీవనంలోనే కాక, వ్యక్తిగత జీవితాలను కూడా తీర్చిదిద్దుకుందాం. దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు మనం అర్పించగలిగే నివాళి ఇదే. ■




# కశ్మీర్‌లో మార్పు మొదలైంది

• కర్రావు

కశ్మీర్ లోయలో పరిస్థితుల్లో గణనీయమైన మార్పు వస్తోంది. హురియత్ నేతల ప్రకటనలకు ఇదివరకు లాగా వార్తాపత్రికల తొలిపేజీలో చోటు దొరకడం లేదు. అలీషా జిలానీ, మీర్ వాయిజ్ వంటి హురియత్ నేతలు తమతమ ఇళ్లకు పరిమితమవుతున్నారు. తాజాగా మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత హురియత్ నేతలను పట్టించుకోవడం మానేశారు. వారికి కేంద్ర గూఢచారి సంస్థల నుంచి నిధులు అందడం ఆగిపోయాయి. పాకిస్థాన్ నుంచి నిధులు రావడం కూడా కష్టతరమైంది. హురియత్ హవాలా లావాదేవీలన్నిటిపైనా ఇప్పుడు జాతీయ దర్యాప్తు బృందం నిఘాపెట్టడంతో వీరికి కూడా కష్టకాలం వచ్చింది. ఈ హురియత్ నేతల ఆర్థిక వనరులన్నీ ఇప్పుడు ఎండిపోతున్నాయి. దీంతో వీరిలో కంగారు మొదలైంది. హురియత్‌ను ఇప్పుడు పట్టించుకునేవారే లేరు. హురియత్ ప్రకటనలకు ఆఖరికి పత్రికలు కూడా విలువనివ్వడం మానేశాయి. మరోవైపు హురియత్ నేతలు కూడా మూడు వర్గాలుగా చీలిపోయి ఉన్నారు. మీర్‌వాయిజ్ వర్గం, అలీషా జిలానీ వర్గం, లోన్ వర్గం పేరిట మూడు ముక్కలాట నడుస్తోంది. అందుకే వారి పిలుపులకు కశ్మీర్ లోయ కూడా స్పందించడం లేదు. హురియత్ నేతలను హిజ్బుల్ ముజాహిదీన్ నుంచి ఇస్లామ్ పేరిట వేరు పడ్డ జాకిర్ ముసా బహిరంగంగా విమర్శిస్తున్నాడు. మరోవైపు జాకిర్ మూసాను హిజ్బుల్ విమర్శిస్తోంది. జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ ఉగ్రవాదులకు హవాలా మార్గంలో డబ్బుల చేరవేతపై గట్టి నిఘా పెట్టడమే కాదు. ఉక్కుపాదం కూడా మోపింది. ఈ దర్యాప్తు వేర్పాటువాదుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. గతంలో మాదిరిగా రాళ్లు విసిరే వాళ్లు ముందుకు రావడం లేదు. పోలీసుల వాహనాలపై దాడులు చేసేవారు క్రమేపీ కనుమరుగవుతున్నారు.

కశ్మీర్ లోయలో రెండో కీలక పరిణామం ఏమిటంటే తొలిసారి ఉగ్రవాదులు ఇక పోరాటం చేయడం వల్ల సాధించేదేమీ లేదని లొంగిపోతున్నారు. భద్రతా దళాల తూటాలు గురితప్పడం లేదు.. ఉగ్రవాదుల్లో భయం పెరిగింది. ఫలితంగా లొంగుబాట్లు పెరిగాయి. భద్రతా దళాలు అనుసరిస్తున్న వ్యూహం వల్ల, ఉగ్రవాదులపై వారి కుటుంబాలను ఉపయోగించి ఒత్తిడి తేవడం వల్ల పరిస్థితిలో మార్పు వస్తోంది

నిజానికి జమ్మూ, లడాఖ్‌లు ఏనాడూ ఉగ్రవాదం వైపు లేవు. అదే విధంగా కశ్మీర్‌లోని గురేజ్, లోలాబ్ సెక్టర్లలోనూ ఉగ్రవాదానికి మద్దతు లేదు. దీంతో కేవలం దక్షిణ కశ్మీర్‌కు మాత్రమే ఉగ్రవాద, వేర్పాటువాదాలు పరిమితమై ఉన్నాయి. ఆ ప్రాంతంలోనూ మోదీ ప్రభుత్వ విధానాల వల్ల పరిస్థితిలో మార్పు వస్తోంది.

వేర్పాటువాద ఉద్యమాల నేతలను ఇప్పుడు పట్టించుకునేవారు లేకుండా పోయారు. దీంతో తొలిసారి కశ్మీర్‌లోయ వేర్పాటువాద రాజకీయాలు నీరసపడ్డాయి. కశ్మీర్‌లో రాళ్ల విసరడం కూడా గణనీయంగా తగ్గింది. దీనికి తోడు సైన్యం, జమ్మూకశ్మీర్ పోలీసులు కలిసికట్టుగా ఉగ్రవాదులను చావుదెబ్బలు తీస్తున్నాయి. అంతర్జాతీయంగా వస్తున్న మార్పుల వల్ల కశ్మీరీ వేర్పాటువాదులకు ప్రపంచవ్యాప్తంగా కూడా మద్దతు కరువవుతోంది. సౌదీ అరేబియా, ఇరాన్ సహా ఏ దేశమూ వారిని సమర్థించేందుకు ముందుకు రావడం లేదు. మొత్తం మీద కశ్మీర్ లోయలో తొలి సారి జాతీయవాద శక్తులు పైచేయి సాధించాయని చెప్పవచ్చు.

ఈ మార్పును ఉపయోగించుకునేదిశగా కొన్ని నెలల క్రితం కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మూడు రోజుల పాటు కశ్మీర్‌లో పర్యటించి, పలు వర్గాల ప్రజలను కలుసుకున్నారు. ఈ నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌లో రాజకీయ పరిష్కారం దిశగా ప్రభుత్వం పావులు కదుపుతోందన్నది పరిశీలకులకు అర్థమై పోయింది. కశ్మీర్ లోయలో మామూలు పరిస్థితులు నెలకొనే దిశగా దృఢమైన చర్యలకు సమయం ఆసన్నం అవుతోందన్నది వారికి అర్థమైంది.

ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం జమ్మూ కశ్మీర్ వ్యవహారాల నిపుణుడు, మాజీ సీబీఐ ఉన్నతాధికారి దేవేశ్వర్ శర్మను చర్చలు జరిపేందుకు నియమించింది. వస్తే హురియత్‌తో మాట్లాడేందుకూ తాను సిద్ధమేనని శర్మ ఇప్పటికే ప్రకటించారు. ఇప్పటికే దాదాపు వందకి పైగా ప్రతినిధి బృందాలు ఆయన్ని కలిశాయి. ఆయన ముందు తమ సమస్యల చిట్టాను విప్పి చూపించాయి. త్వరలో మరికొన్ని సంస్థలు ఆయన్ని కలుస్తాయి. ఆయన్ని కలవకుండా సమావేశాలను బహిష్కరించిన వారు మూలన పడిపోయే ప్రమాదం కనిపిస్తోంది. దీంతో నేడో రేపో ఒక్కొక్కరుగా వేర్పాటువాద నేతలు కూడా వచ్చి కలిసే అవకాశాలే కనిపిస్తున్నాయి. దేవేశ్వర్ శర్మ మంత్రదండంతో కశ్మీర్ లోయలో పరిస్థితిని చక్కదిద్దుతాడని భావించడమూ పొరబాటే. అయితే ఆయన ప్రయత్నం ఒక మంచి ప్రారంభం. నిజమైన కశ్మీరీ పేదలతో, అట్టడుగున ఉన్న వారితో, తుపాకీ విడిచి వచ్చిన వారితో చర్చించాల్సిన అవసరంఉంది. ఈ దిశగా జరుగుతున్న ప్రయత్నమే శర్మ నియామకం. ■



భారీ వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్ రావు నేతృత్వంలో బిజెపి ప్రతినిధి బృందం గవర్నర్ నరసింహన్‌కు వినతిపత్రం సమర్పించింది. ఈ బృందంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోలి మధుసూదన్ రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి పి.సుగుణాకర్ రావు తదితరులు ఉన్నారు.



పరోపకారమే పుణ్యం, పర పీడనమే పాపం. – శ్రీ విద్యా ప్రకాశనందగిరి స్వామి

వర్తమానం



# ఆలోచనలను మలుస్తున్న వార్తాపత్రికలు

**నవంబర్ 6న చెన్నైలో 'దిన తంతి' పత్రిక 75వ (ప్లాటినం జూబ్లీ) వార్షికోత్సవాల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఆ ప్రసంగంలోని ముఖ్యాంశాలు వారి మాటల్లోనే చూద్దాం.**

'దిన తంతి' 75 సంవత్సరాల అద్భుత ప్రస్థానాన్ని పూర్తి చేసినందుకు ఎస్.పి.అదితనార్, ఎస్.టి.అదితనార్, బాలసుబ్రమణియన్ కృషిని అభినందిస్తున్నాను. గడచిన 75 సంవత్సరాలుగా వారి అమేయ కృషి 'తంతి'ని కేవలం తమిళనాడులోనే కాక దేశం మొత్తంమీదనే అతి పెద్ద ప్రసార మాధ్యమ సంస్థలలో ఒక సంస్థగా నిలిపాయి. కోట్లాది భారతీయులకు ఇవాళ 24 గంటల వార్తా చానళ్లు అందుబాటులో ఉన్నాయి. అయితే, నేటికీ చాలా మంది దినచర్య ఒక చేతిలో టీ కప్పు లేదా కాఫీ కప్పు, మరో చేతిలో వార్తాపత్రిక తోనే మొదలవుతుంది.

మానవ జాతి జ్ఞాన జిజ్ఞాస కూడా చరిత్రలాగానే అత్యంత పురాతనం. ఈ దాహార్తిని తీర్చడానికి పాత్రికేయం తోడ్పడుతుంది. నేటి వార్తాపత్రికలు కేవలం వార్తలివ్వడంతోనే సరిపెట్టడం లేదు. అవి మన ఆలోచన ధోరణిని మలచగలిగినవే కాకుండా మన కోసం ప్రపంచ గవాక్షాన్ని తెరుస్తాయి. విస్తృతార్థంలో చూస్తే పత్రికా మాధ్యమాలంటే పరివర్తన చెందుతున్న సమాజమే. అందుకే ఈ మాధ్యమాన్ని మనం ప్రజాస్వామ్య నాలుగో స్తంభంగా అభివర్ణిస్తుంటాం.

వలస పాలన చీకటి కాలంలో రాజా రామ్మోహన్ రాయ్ 'సంవాద్ కౌముది', లోక మాన్య తిలక్ 'కేసరి', మహాత్మగాంధీ 'నవజీవన్' వంటి ప్రచురణలు కరదీపికలై స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి రగిలించాయి. దేశంలో పాత్రికేయానికి మార్గదర్శులుగా వారు జీవిత సౌఖ్యాలను త్యాగం చేశారు. వార్తా పత్రికల ద్వారా సామూహిక చైతన్యానికి, అవగాహన కల్పనకు తోడ్పడ్డారు. అటువంటి సంస్థాపక మార్గదర్శుల ఆదర్శాల వల్లనే కాబోలు.. బ్రిటిష హయాంలో అనేక వార్తా పత్రికలు స్థాపితమై, దినదిన ప్రవర్ధమానమై నేటికీ కొనసాగుతున్నాయి.



దేశం పట్ల, సమాజం పట్ల తాము నిర్వర్తించాల్సిన కర్తవ్యాన్ని తదుపరి తరాలు నెరవేర్చడాన్ని మనం విస్మరించరాదు. అది మనం స్వాతంత్ర్యం సాధించిన విధానం. అటుపైన ప్రజా జీవనంలో పౌర హక్కులకు ప్రాధాన్యం ఏర్పడింది. దురదృష్టవశాత్తూ కాలక్రమంలో మనం వ్యక్తిగత, సామూహిక బాధ్యతలను నిర్లక్ష్యం చేశాం. నేడు సమాజాన్ని పీడిస్తున్న అనేక రుగ్మతలకు ఇది కొంతమేర కారణమైంది. ఇప్పుడిక "కార్యనిమగ్న, బాధ్యతాయుత, అవగాహన కలిగిన పౌరుల" సృష్టి దిశగా సామూహిక అవగాహన కల్పించాల్సిన తరుణం ఆసన్నమైంది. 'హక్కు', 'బాధ్యతయుత కార్యాచరణ' రెంటిపై పౌర అవగాహనతో సముచిత సమతూకం ఉండాలి. ఇది మన విద్యావ్యవస్థ, రాజకీయ నాయకుల దక్షత ద్వారానే సాధ్యమన్నది వాస్తవమే. అయితే, ఈ కృషిలో ప్రసార మాధ్యమాలు కూడా కీలకమైన పాత్రను పోషించాల్సి ఉంది.

అనేక వార్తాపత్రికలు స్వాతంత్ర్యం దిశగా ప్రజాభిప్రాయాన్ని మలచగా, వాటిలో వివిధ భాషల పత్రికలు ఉన్నాయి. వాస్తవానికి విభిన్న భాషల భారత పత్రికా ప్రపంచం అంటే బ్రిటిష ప్రభుత్వానికి భయమే. కాబట్టే వాటిని అణచివేయడం కోసం 1878లో 'విభిన్న భాషా

పత్రికల చట్టాన్ని' తీసుకువచ్చింది. వైవిధ్యభరిత భారతదేశంలో ప్రాంతీయ భాషలలో ప్రచురిత మయ్యే వార్తాపత్రికల పాత్రకు నాటి తరహాలోనే నేటికీ అదే ప్రాముఖ్యత ఉంది. ప్రజలు సులభంగా అర్థం చేసుకోగల భాషతో అవి సమాచారాన్ని అందించేవి. ఈ కర్తవ్యంలో భాగంగా తరచూ బలహీనవర్గాల, అణగారిన సామాజిక వర్గాల పక్షం వహించేవి. అందువల్ల వాటి బలాన్ని, ప్రభావాలనే గాక వాటి బాధ్యతను కూడా ఎన్నడూ తక్కువగా అంచనా వేయడం సాధ్యం కాదు. అవి సుదూర ప్రాంతాల సమాచారంతో పాటు ప్రభుత్వ ఉద్దేశాలను, విధానాలను ప్రజల్లోకి తెచ్చే వార్తాహరులు. అదే సమయంలో అవి మన ప్రజల ఆలోచనలను, భావాలను, ఉద్వేగాలను స్పష్టంగా చూపించే మార్గదర్శులు.

ప్రపంచవ్యాప్తంగా నిత్యం సంభవించే పరిణామాలన్నీ ఒక వార్తాపత్రికలో ఎలా ఇమిడిపోతున్నాయా అని ప్రజలు ఆశ్చర్యపో తుంటారని నేను విన్నాను. నిశితంగా గమనిస్తే ఈ భూగోళం మీద ప్రతిరోజూ ఎన్నో పరిణామాలు చోటు చేసుకుంటాయి. అయితే, వీటిలో అత్యంత ముఖ్యమైనవేవో సంపాదకులు నిర్ణయిస్తారు. ముఖపత్ర కథనాలుగా వేటిని ఇవ్వాలో వారు నిర్ణయిస్తారు. దేనికి ఎంత స్థలం కేటాయించాలో, దేన్ని వదలివేయాలో కూడా వారే తేలుస్తారు. ఇది ఎంతో గొప్ప బాధ్యతాయుతమైనటువంటి విధి నిర్వహణ. ప్రజాహితం దృష్ట్యా సంపాదకత్వ స్వేచ్ఛను ఎంతో వివేకంతో వినియోగించాలి. అలాగే ఏం రాయాలో, ఏం రాయించాలో కూడా నిర్ణయించే స్వేచ్ఛ అలాంటిదే. ఆ స్వేచ్ఛ “కచ్చితమైనదాని కన్నా తక్కువగా” లేదా “వాస్తవం కన్నా తప్పుగా” ఉండరాదని మహాత్మ గాంధీ స్వయంగా చెప్పారు. “పత్రికలను నాలుగో స్తంభంగా పిలుస్తారు. అది కచ్చితంగా ఓ శక్తే.. కానీ, దానిని దుర్వినియోగం చేయడం నేరం.”

పత్రికా, ప్రసార వ్యవస్థల నిర్వహణ ప్రైవేటు వ్యక్తుల చేతులలో ఉన్నప్పటికీ, అది ప్రజా శ్రేయస్సుకు తోడ్పడుతుంది. మేధావులు చెప్పినట్లు బలప్రయోగంతో కాకుండా శాంతిమార్గంలో సంస్కరణలను తెచ్చే ఒక ఉపకరణం ఇది. అందువల్ల ఎన్నికైన ప్రభుత్వంతో, న్యాయ వ్యవస్థతో సమానంగా దానికీ సామాజిక జవాబుదారీతనం ఉంది. అలాగే దాని ప్రవర్తన కూడా ఉన్నతంగా ఉండాలి. ప్రసిద్ధ సాధువు తిరువళ్లువార్ మాటలలో చెప్పాలంటే, “ఈ ప్రపంచంలో కీర్తిని, సంపదను సమానంగా తెచ్చిపెట్ట గలిగింది నైతికత కన్నా మరొకటి ఏదీ లేదు”.

ఇవాళ పౌరులంతా విశ్లేషణలలో, చర్చల్లో పాల్గొనడంతో పాటు వారికి చేరుతున్న వార్తలను బహుళ వనరుల ద్వారా పరిశీలించి లోతుగా తనిఖీ చేసుకొంటున్నారు. కాబట్టి మీడియా తన విశ్వసనీయతను కొనసాగించా లంటే అదనపు జాగ్రత్తలను తీసుకోవడం అవసరం. విశ్వసనీయ మీడియా సంస్థల మధ్య ఆరోగ్యకరమైన స్పర్ధ కూడా ప్రజాస్వామ్యం మనుగడకు ఎంతో మేలు చేస్తుంది. విశ్వసనీయతకు పెరిగిన ప్రాధాన్యం ఆత్మశోధన అంశాన్నీ మన ముందుకు తెచ్చింది. మీడియాలో సంస్కరణలన్నవి తరచూ ఆత్మశోధన ద్వారా అంతర్గతంగానే వస్తాయన్నది నా విశ్వాసం. కొన్ని సందర్భాల్లో ఆత్మశోధన ప్రక్రియను మనం చూస్తుంటామన్నది వాస్తవమే. ముంబైపై 26/11 ఉగ్రదాడుల తాలూకు విశ్లేషణ అటువంటి ఆత్మశోధనలలో ఒకటి. ఇటువంటిది తరచూ సాగుతుం డాలన్నది నా అభిప్రాయం.

స్వచ్ఛభారత్ మిషన్ విషయంలో మీడియా ప్రతిస్పందనను కొనియాడేందుకు నేను ఈ అవకాశాన్ని వినియోగించుకొంటున్నాను. మహాత్ముని 150వ జయంతి నాటికి అంటే 2019 వరకు మనం స్వచ్ఛభారత్‌ను సాధించేందుకు కృషి చేస్తున్న నేపథ్యంలో మీడియా పోషిస్తున్న నిర్మాణాత్మక పాత్ర నా హృదయాన్ని స్పృశించింది. ఆ మేరకు పరిశుభ్రతపై సామూహిక చైతన్యాన్ని, అవగాహనను సృష్టించడంలో నిరుపమానంగా కృషి చేస్తోంది. మన లక్ష్యాన్ని చేరుకునేందుకు ఇంకా చేయాల్సిన దానినీ గుర్తుచేస్తోంది.

మీడియా కీలక పాత్రను పోషించవలసిన అంశం మరొకటి ఉంది. అదే 'ఏక్ భారత్– శ్రేష్ఠ భారత్'. దీనికో ఉదాహరణ చెబుతాను. ఈ లక్ష్యం కోసం ఏడాది పాటు వార్తాపత్రికలు రోజూ కొన్ని సెంటీమీటర్ల స్థలం కేటాయించగలవా? ప్రతి రోజూ వారు ఒక సరళమైన నినాదాన్ని తమ తమ భాషలలో ప్రచురించవచ్చు. అవసరమైతే దాన్ని అన్ని ప్రధాన భాషల్లో అనువదించి కూడా ప్రచురించవచ్చు.

సంవత్సరం చివరలో సదరు పత్రిక పాఠకులకు అన్ని భారతీయ భాషలలో అటువంటి 365 వాక్యాలు తగిన అవగాహన కల్పించగలవు. ఈ సరళమైన చర్య సృష్టించే సానుకూల ప్రభావాన్ని ఒక్కసారి ఊహించండి. అలాగే పాఠశాలల్లో విద్యార్థులు దీనిపై రోజూ కాసేపు చర్చించేలా చేయవచ్చు. దీనివల్ల పిల్లలు కూడా మన వైవిధ్యం, బలంలో గల సుసంపన్నతను అర్థం చేసుకోగలుగుతారు. ఆ విధంగా ఈ చర్య ఒక గొప్ప లక్ష్యం కోసం ఉపయోగపడటమేగాక పత్రికను కూడా బలోపేతం చేస్తుంది.

**–జనసందేశ్ ప్రతినిధి**




రాష్ట్రంలో పత్తిరైతుల సమస్యలు పరిష్కరించాలని, నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ నవంబర్ 12న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్ సింగ్‌కు వినతిపత్రం సమర్పించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్, శాసనసభ పక్షనేత జి.కిషన్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోలి మధుసూదన్ రెడ్డి తదితరులు



జీవితమనే యుద్ధరంగంలో ధైర్యంగా పోరాడే సైనికుని శక్తి, స్ఫూర్తి మనకిప్పుడు కావాలి. – స్వామి వివేకానంద

విశ్లేషణ



# నోట్లరద్దుతో ఎనలేని ప్రయోజనాలు




**అరుణ్ జైట్లీ**
కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి


నవంబర్ 8, 2016.. భారత ఆర్థిక వ్యవస్థకు చారిత్రాత్మక రోజు. దేశాన్ని దీర్ఘకాలంగా పట్టిపీడిస్తున్న నల్లధన జబ్బును వదిలించేందుకు మోదీ ప్రభుత్వం గట్టిగా తీర్మానించిన రోజు. గత కాంగ్రెస్ పాలకుల నిర్వాకంతో దేశంలో అవినీతి వ్యవస్థీకృతమైంది. అవినీతిపై సామాన్యుడిలో "నడుస్తుందిలే.." అన్న ధోరణి ఏర్పడింది. దీనిపై సమాజంలో ముఖ్యంగా దిగువ, మధ్య తరగతి ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. 2014లో ప్రజలు బిజెపికి విజయం కట్టబెట్టడానికి అంతులేని అవినీతి ప్రధాన కారణం.

మే 2014లో అధికారంలోకి రాగానే నల్లధనం నిర్మూలించాలన్న ప్రజల కోరిక మేరకు మోదీ ప్రభుత్వం చర్యలు మొదలు పెట్టింది. వెంటనే నల్లధనంపై సిట్‌ను నియమించింది. నల్లధనంపై సుప్రీం కోర్టు ఆదేశాలను కొన్నేళ్లుగా గత పాలకులు పట్టించుకోలేదన్న విషయం దేశ ప్రజలకు తెలుసు. అంతేకాదు బినామీ ఆస్తుల చట్టాన్ని 28 ఏళ్లపాటు వాయిదా వేస్తూ రావడం నల్లధనంపై వారి వైఖరేంటో స్పష్టంగా తెలుస్తుంది. అయితే మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కఠిన చర్యలు మొదలు పెట్టింది. నల్లధనంపై సిట్ నియామకం నుంచి పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వరకు.. ఇవన్నీ నల్లధనం నిర్మూలనపై మోదీ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం.

నవంబర్ 8న "నల్లధన వ్యతిరేక దినం" జరుపుకొంటున్న సందర్భంగా నోట్ల రద్దుతో ఆశించిన ఫలితాలు నెరవేరాయా అన్న చర్చ మొదలైంది. ఈ సమయంలో నోట్ల రద్దు స్వల్ప, మధ్య కాలిక ప్రయోజనాలేంటో చూద్దాం. జూన్ 30, 2017 నాటికి రూ.15.28 లక్షల కోట్ల నగదు బ్యాంకుల్లో జమ అయ్యిందని ఆర్బీఐ చెప్పింది. నవంబర్ 8, 2016 నోట్ల రద్దు నిర్ణయంతో చెల్లకుండా పోయిన మొత్తం 1000, 500 రూపాయల నోట్ల విలువ రూ.15.44 లక్షల కోట్లు. అప్పటివరకు చెలామణిలో ఉన్న మొత్తం నగదు విలువ రూ.17.77 లక్షల కోట్లు. మొత్తం నగదులో 86 శాతం పెద్దనోట్లే. దీంతో పన్ను ఎగవేత, మనీ లాండరింగ్ లాంటి అక్రమాలకు ఆస్కారం ఏర్పడింది.

తక్కువ నగదు ఆర్థిక వ్యవస్థగా దేశాన్ని రూపొందించి, నల్లధనం తగ్గించడం... నోట్ల రద్దు వెనకున్న ప్రధాన ఉద్దేశం. ఇప్పటివరకు ఫలితాలను గమనిస్తే అది నెరవేరినట్లు కనిపిస్తుంది. సెప్టెంబర్ 2017 నాటికి చలామణిలో ఉన్న మొత్తం నగదు విలువ రూ.15.89 లక్షల కోట్లుగా ఉంది. ఒక్క ఏడాదిలో రూ.1.39 లక్షల కోట్లు తగ్గింది. గత ఏడాది అంతకుముందు సంవత్సరం కన్నా రూ.2.50 లక్షల కోట్ల నగదు చెలామణి పెరిగింది. అంటే నోట్ల రద్దు వల్ల మొత్తం రూ.3.89 లక్షల కోట్ల నగదు చెలామణి తగ్గిందని చెప్పుకోవచ్చు.

> **సెప్టెంబర్ 2017 నాటికి చలామణిలో ఉన్న మొత్తం నగదు విలువ రూ.15.89 లక్షల కోట్లుగా ఉంది. ఒక్క ఏడాదిలో రూ.1.39 లక్షల కోట్లు తగ్గింది. గత ఏడాది అంతకుముందు సంవత్సరం కన్నా రూ.2.50 లక్షల కోట్ల నగదు చెలామణి పెరిగింది. అంటే నోట్ల రద్దు వల్ల మొత్తం రూ.3.89 లక్షల కోట్ల నగదు చెలామణి తగ్గిందని చెప్పుకోవచ్చు.**

మన వ్యవస్థలో నుంచి నగదును ఎందుకు తొలగించాలి? నగదు చలామణిని ఎందుకు తగ్గించాలి? దేశంలో చలామణి అవుతున్న నగదుకు ఒక చిరునామా తేవడం నోట్ల రద్దు ప్రధాన ఉద్దేశంలో ఒకటి. ప్రస్తుతం చలామణిలో ఉన్న రూ.15.28 లక్షల కోట్ల విలువగల మొత్తం నగదు బ్యాంక్ వ్యవస్థలో ఉంది. అంటే మొత్తం నగదుకు ఒక చిరునామా ఏర్పడింది.

నోట్ల రద్దుతో రూ.1.6 నుంచి 1.7 లక్షల కోట్ల విలువ గల అనుమానాస్పద లావాదేవీలు వెలుగులోకి వచ్చాయి. ఇవన్నీ సంబంధిత అధికారుల దృష్టికి చేరాయి. వీటిపై తగిన చర్యలు తీసుకునే వీలు కలిగింది. 2016-17లో బ్యాంకులు 3,61,214 లావాదేవీలు అనుమానాస్పదంగా ఉన్నాయని ఫిర్యాదు చేశారు. అంతకుమందు ఏడాది ఉన్న అనుమానాస్పద లావాదేవీలు కేవలం 61,361. ఇతర ఆర్థిక సంస్థల్లో అనుమానాస్పద లావాదేవీలు 40,333 నుంచి 94,836కు పెరిగింది. ఇక సెబీలో నమోదు చేసుకున్న మధ్యవర్తుల సంఖ్య 4579 నుంచి 16,953కు పెరిగింది.

ఈ ఏడాది ఆదాయపన్ను అధికారులు రూ.15,497 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇది గత ఏడాదితో పోలిస్తే రెట్టింపు. సోదాల్లో వెలుగు చూసిన వెల్లడించని ఆదాయం విలువ రూ.29,213 కోట్లు. ఇది అనుమానాస్పద లావాదేవీల్లో ఉన్న నగదులో 18 శాతానికి సమానం. ఆపరేషన్ క్లీన్ మనీ దిశగా గొప్ప ముందడుగు.

ఈ ఏడాది 56 లక్షల కొత్త వ్యక్తిగత టాక్సు పేయర్లు రిటర్నులు ఫైల్ చేశారు. గత ఏడాది వ్యక్తిగత టాక్సు పేయర్ల సంఖ్య కేవలం 22 లక్షలు మాత్రమే. 2016తో పోలిస్తే 2017లో నాన్ కార్పొరేట్ టాక్స్ పేయర్స్ నుంచి చెల్లించిన సెల్ఫ్ అసెస్మెంట్ టాక్స్ 34.25 శాతం పెరిగింది. ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 5 మధ్య కాలంలో వసూలైన అడ్వాన్స్ టాక్స్ అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే 42 శాతం ఎక్కువ. నోట్లరద్దు అనంతరం చేపట్టిన చర్యలతో 2.97 లక్షల డొల్ల కంపెనీలను గుర్తించారు. ఇప్పటికే నోటీసులు జారీ చేసి 2.24 లక్షల కంపెనీలను రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ గుర్తింపు రద్దు చేశారు. వాటి బ్యాంకు ఖాతాలను స్తంభింపచేశారు. ఆయా కంపెనీల డైరెక్టర్లపై అనర్హత వేటు వేశారు. వీటిలోని 28,088 కంపెనీలకు చెందిన బ్యాంకు అకౌంట్లు 2016 నవంబర్ 9న రూ.10,200 కోట్లు డిపాజిట్ చేసి విత్ డ్రా చేశాయి. వీటిలో ఒక్కొక్క కంపెనీకి 100కు పైగా బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. గరిష్ఠంగా 2134 బ్యాంకు ఖాతాలు కూడా ఉన్నాయి. రూ.13,300

కోట్లకు పైగా మనీలాండరింగ్‌కు పాల్పడిన 1150 డొల్ల కంపెనీలపై ఆదాయపు పన్ను శాఖ చర్యలు మొదలు పెట్టింది. అవకతవకల కు పాల్పడుతున్న 800 కంపెనీలను సెబీ గుర్తించింది. అందులో 450 కంపెనీలను షేర్ మార్కెట్ నుంచి తొలగించింది. ప్రమోటర్ల డీమ్యాట్ స్తంభింపచేసింది.

నోట్లరద్దుతో సేవింగ్స్ పెరిగాయి. కార్పొరేట్ బాండ్ మార్కెట్ ఆ ఫలాలు కనిపిస్తున్నాయి. 2016-17లో రూ.1.78 కోట్ల కార్పొరేట్ బాండ్లు విడుదల చేశారు. అంతకుముందు విడుదల చేసిన బాండ్ల విలువ కేవలం రూ.78,000. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు రూ.3.43 కోట్లకు చేరాయి. గత ఏడాదితో పోలిస్తే 155 శాతం మేర వృద్ధి నమోదైంది. నవంబర్ 2016 నుంచి జూన్ 2017 కాలంలో మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు 1.7 లక్షల కోట్లు అయితే అంతకుముందు ఏడాది ఇదే కాలంలో ఉన్న పెట్టుబడులు కేవలం రూ.9160 కోట్లు మాత్రమే. 2016 నవంబర్‌లో ఇన్సూరెన్స్ కంపెనీలు వసూలు చేసిన ప్రీమియం అంతకుముందు ఏడాది కన్నా రెట్టింపు. తక్కువ నగదు వ్యవస్థలో భాగంగా భారత్ డిజిటల్ పేమెంట్స్‌లో గణనీయమైన ప్రగతి సాధించింది. ఈ ఏడాది క్రెడిట్ కార్డు ద్వారా 110 కోట్ల లావాదేవీలు జరిగాయి. వీటి విలువ రూ.3.3 లక్షల కోట్లు. గత ఏడాది దీని విలువ రూ.1.6 లక్షల కోట్లు. ఈ ఏడాది డెబిట్ కార్డు ద్వారా 240 కోట్ల లావాదేవీలు జరిగాయి. వీటి విలువ రూ.3.3 లక్షల కోట్లు. గత ఏడాది దీని విలువ రూ.2.4 లక్షల కోట్లు మాత్రమే. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పీపీఐ (ప్రీపెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్స్) లావాదేవీలు 75 కోట్ల నుంచి 196 కోట్లకు పెరిగాయి. వాటి విలువ రూ.48,000 కోట్ల నుంచి రూ.83,800కు పెరిగింది. నెఫ్ట్ లావాదేవీలు 130 కోట్ల నుంచి 160 కోట్లకు పెరిగాయి. లావాదేవీల విలువ రూ.83 లక్షల కోట్ల నుంచి రూ.120 లక్షల కోట్లకు పెరిగింది. వేతనాలు బ్యాంకు ఖాతాలో జమ అవడంతో ఉద్యోగులకు ఈపీఎఫ్, ఈఎస్ఐసీ తదితర ప్రయోజనాలు చేకూరాయి. వారికి సామాజిక భద్రత కలిగింది. నోట్ల రద్దు తర్వాత కోటి మంది కార్మికులు ఈపీఎఫ్, ఈఎస్ఐసీ వ్యవస్థలోకి చేరారు. ఈ సంఖ్య ప్రస్తుతం ఉన్న లబ్ధిదారుల్లో 30 శాతం. పేమెంట్ ఆఫ్ వేజెస్ యాక్ట్ సవరణలతో కొత్తగా 50 లక్షల మంది కార్మికులకు వేతనాలు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి.

**వేతనాలు బ్యాంకు ఖాతాలో జమ అవడంతో ఉద్యోగులకు ఈపీఎఫ్, ఈఎస్ఐసీ తదితర ప్రయోజనాలు చేకూరాయి. వారికి సామాజిక భద్రత కలిగింది. నోట్ల రద్దు తర్వాత కోటి మంది కార్మికులు ఈపీఎఫ్, ఈఎస్ఐసీ వ్యవస్థలోకి చేరారు. ఈ సంఖ్య ప్రస్తుతం ఉన్న లబ్ధిదారుల్లో 30 శాతం. పేమెంట్ ఆఫ్ వేజెస్ యాక్ట్ సవరణలతో కొత్తగా 50 లక్షల మంది కార్మికులకు వేతనాలు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి.**

నోట్ల రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో అల్లరి మూకలు రాళ్లు విసిరే ఘటనలు గణనీయంగా తగ్గాయి. అదేవిధంగా మావోయిస్టుల కార్యకలాపాలు తగ్గిపోయాయి. నోట్లరద్దు తర్వాత నకిలీ నోట్ల బెడద తగ్గుముఖం పట్టింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆర్బీఐ రెట్టింపు నిష్పత్తిలో నకిలీ నోట్లను గుర్తించింది. నోట్ల రద్దుతో స్వచ్ఛమైన, పారదర్శకమైన, నిజాయితీతో కూడుకున్న ఆర్థిక వ్యవస్థ దిశగా దేశం ముందడుగు వేస్తుంది. ప్రస్తుతం కొన్ని వర్గాలకు నోట్లరద్దు ప్రయోజనాలు ప్రత్యక్షంగా కానీ భవిష్యత్ తరాలకు ఈ చర్య గణనీయమైన మేలు చేకూరుస్తుందనడం సందేహం లేదు.■



నవంబర్ 5న కూకట్‌పల్లి బిజెపి కార్యాలయంలో బిజెపి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మాధవరం కాంతారావు సమక్షంలో హైదర్‌నగర్ డివిజన్‌కు చెందిన నందకుమార్ ఆధ్వర్యంలో సుమారు వెయ్యిమంది బిజెపిలో చేరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకర్ రావు, కార్యదర్శి వి.కేశవరావు, సూర్యారావు, విశ్వేశ్వర్ రావు, రవికుమార్ గౌడ్, వీరయ్య చారి, అరుణ్ కుమార్, జయన్న, రామరాజు, నర్సింగ్ రావు, ఎం.కే.దేవ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



స్థానిక నిరుద్యోగులకే ఉద్యోగాలు ఇవ్వాలని సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గం చింతలపాలెం మండలం దొండపాడులోని జువారి సిమెంట్ పరిశ్రమ ముందు నవంబర్ 10న బిజెపి నేతలు ధర్నాకు దిగారు. ధర్నాకు దిగిన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొబ్బా భాగ్యరెడ్డితో పాటు బిజెపి నేతలను పోలీసులు అరెస్టు చేశారు.



పొగిడితే మందహాసం చేసి, తిడితే మౌనం వహించువాడు ఉత్తముడు. - గాంధీ

జనవాణి

## రైతు సమన్వయ సమితి:

# ఓట్లు గుంజే ఎత్తుగడ

• ప్రవీణ్

తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న రైతు సమన్వయ సమితులు వచ్చే ఎన్నికల్లో ఓట్లు దండుకోవడం కోసం ఏర్పాటు చేసుకొంటున్న అధికార పార్టీ కమిటీలే గాని రైతులకు ఒరగబెట్టడం కోసం కాదని శాసనసభలో ఈ విషయమై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రసంగం స్పష్టం చేస్తుంది. పైగా కేవలం అధికార పార్టీకి చెందిన వారితోనే ఈ కమిటీలను ఏర్పాటు చేసుకుంటామని కేసీఆర్ నిస్సిగ్గుగా స్పష్టం చేశారు. గతంలో వై.ఎస్.రాజశేఖర రెడ్డి ప్రభుత్వం ఆదర్శ రైతుల పేరుతో కాంగ్రెస్ కార్యకర్తలను నియమించలేదా అని తన ప్రభుత్వం చేస్తున్న 'అధికార దుర్వినియోగాన్ని' ఎటువంటి సంకోచం లేకుండా సమర్థించుకున్నారు. తాము తప్పు చేస్తే ప్రజాకోర్టులో తమకు శిక్ష వేస్తారని, ఒప్పయితే మళ్లీ తమకే అధికారం ఇస్తారంటూ ఎన్నికల ఎత్తుగడగానే ఈ ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పకనే చెప్పారు.


మార్కెట్ కమిటీలు, కో ఆపరేటివ్ సొసైటీలు ఉన్న తరువాత రైతు సమన్వయ సమితులు ఎందుకన్న ప్రశ్నకు గత ప్రభుత్వాలు ఈ విధంగా చేయలేదా అంటూ గడుసుగా జవాబిచ్చారు. అయితే ఇలాంటి అధికార దుర్వినియోగం చేసిన గత ప్రభుత్వాలు ప్రజా తిరస్కారానికి గురయ్యాయని కేసీఆర్ మరచిపోయినట్టున్నారు. రైతు సమితుల ప్రొసీడింగ్స్‌పై కలెక్టర్, వ్యవసాయ అధికారుల సంతకాలు కూడా ఉండక పోవడంతో వాటి చెల్లుబాటు ప్రశ్నార్థకంగా మారింది. రైతు సమన్వయ సమితుల్లో రైతులు కాని వారు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, భూమి లేని వారు కూడా ఉండడాన్ని ప్రస్తావించిన ప్రతిపక్షాలను ఎదురుదాడితో నోరు నొక్కే ప్రయత్నం చేశారు. గ్రామసభల ద్వారా పారదర్శకంగా రైతు సమన్వయ సమితులు ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదు.

రైతు సమన్వయ సమితుల ఏర్పాటుతో పాటు భూముల సర్వే సైతం ప్రభుత్వం ఏకపక్షంగా, అధికార పార్టీ కార్యక్రమంగా చేస్తోంది. పారదర్శకత, జవాబుదారీతనం ఏ మాత్రం కనిపించడం లేదు. ప్రతిపక్షాలకు చెందిన శాసనసభ్యులు ఉన్నచోట వారితో సంబంధం లేకుండానే అధికార పార్టీ నాయకుల పర్యవేక్షణలో పని కానిచ్చేస్తున్నారు. తెలంగాణ రైతులలో 45 శాతం మంది కౌలు రైతులే ఉన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలో కౌలు రైతులు అనే పదం లేకుండా చేశారు. ఇప్పటికే ప్రభుత్వం అందిస్తున్న అనేక సహాయాలు సాగుచేయని రైతులకు ఇస్తూ కౌలుదారులకు అన్యాయం చేస్తున్నారు. అసలు కౌలుదారులనే గుర్తించనని ముఖ్యమంత్రి స్పష్టం చేస్తున్నారు.

అధికార దుర్వినియోగం చేసిన గత ప్రభుత్వాలు ప్రజా తిరస్కారానికి గురయ్యాయని కేసీఆర్ మరచిపోయినట్టున్నారు. రైతు సమితుల ప్రొసీడింగ్స్‌పై కలెక్టర్, వ్యవసాయ అధికారుల సంతకాలు కూడా ఉండక పోవడంతో వాటి చెల్లుబాటు ప్రశ్నార్థకంగా మారింది. రైతు సమన్వయ సమితుల్లో రైతులు కాని వారు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, భూమి లేని వారు కూడా ఉండడాన్ని ప్రస్తావించిన ప్రతిపక్షాలను ఎదురుదాడితో నోరు నొక్కే ప్రయత్నం చేశారు.

కౌలుదారుల చట్టమే దుర్మార్గం అంటూ తన నిజస్వరూపం బయట పెట్టుకున్నారు. ఈ ప్రభుత్వం నిజంగా సాగు చేస్తున్న కౌలు దారులకు వ్యతిరేకం అని వెలడైంది. వ్యవసాయ పెట్టుబడి కింద ఇచ్చే ఎకరానికి ఎనిమిది వేల రూపాయలను కౌలు రైతులకు ఇవ్వబోమని కేసీఆర్ తెలిపారు. కౌలుదారులపేరిట అసలుదారులను ఇబ్బంది పెట్టబోమని చెప్పారు. భూ యజమానులు, కౌలు రైతుల మధ్య జరిగే ఒప్పందంలో ప్రభుత్వం జోక్యం చేసుకోబోదన్నారు.

కౌలుదారులకు పాస్ పుస్తకాలు కూడా ఇవ్వబోమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇదే అంశంపై తెలంగాణ భూ హక్కులు– పట్టాదారు



పాసుపుస్తకాల చట్ట సవరణ బిల్లులోనూ కౌలుదారుల పేరును తొలగించారు. రైతులకు మాత్రమే రూ.8 వేలు పంట పెట్టుబడి ఇస్తామని, కౌలుదారులకు ఇవ్వబోమని స్పష్టం చేస్తూ "మా మొదటి ప్రాధాన్యం రైతులకే, కౌలు రైతులకు కాదు. కౌలుదారు చట్టం చాలా ప్రమాదకరమైంది. కౌలుదారు పేరుతో అసలైన రైతులకు నష్టం జరుగుతోంది" అని అన్నారు. రైతులకూ, కౌలుదారులకూ సంబంధం ఉంటే అది వారిద్దరూ చూసుకోవాలని కేసీఆర్ స్పష్టం చేశారు. పైగా కౌలుదారులు హక్కులను కాపాడటం కోసం గతంలో వై.ఎస్.రాజ శేఖరరెడ్డి ప్రభుత్వం నియమించిన కోనేరు రంగారావు కమిషన్ సిఫారసులు తెలంగాణ ప్రభుత్వానికి వర్తించవని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో చేసిన చట్టాలు తమ ప్రభుత్వానికి వర్తించవు అన్న చందంగా వ్యవహరిస్తున్నారు.

ఇప్పుడు ప్రభుత్వం ఇస్తామంటున్న వ్యవసాయ పెట్టుబడులు సాగు చేసేవారికి చెందబోవని ముఖ్యమంత్రి మాటలే వెల్లడిస్తున్నాయి. దాంతో ప్రభుత్వ కార్యక్రమాల నిధులు టీఆర్ఎస్ కార్యకర్తలకు పంచి పెట్టడానికే అని అర్థం అవుతుంది.

భూ రికార్డుల ప్రక్షాళనలో రైతు సమన్వయ సమితులు జోక్యం చేసుకుంటున్నాయని బిజెపి సభ్యుడు ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్ విమర్శించారు. ఈ సమితులను రాజకీయాలకు అతీతంగా ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పైగా తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ఇవ్వబోతున్న పాస్‌బుక్‌ల మీద కూడా తన ఫోటో ఖచ్చితంగా ఉంటుందని కేసీఆర్ చెప్పుకున్నారు. భూ హక్కులకు సంబంధించిన ఈ పుస్తకాలు శాశ్వతంగా ఉండే రికార్డులు. వీటిపై ప్రభుత్వ అధినేతల ఫోటోలు ఉండటం సరికొత్త సాంప్రదాయానికి తెరతీయడమే. ■

జనవాణి

## రెండు పడకల ఇండ్లు:

# శంకుస్థాపనలే... గృహప్రవేశాలేవి..!?

● కృష్ణ చైతన్య

రాష్ట్రంలోని పేదలందరికీ రెండు పడకల ఇండ్లు నిర్మించి ఇస్తామని 2014 ఎన్నికల సమయంలో టీఆర్ఎస్ అధినేత కె.చంద్ర శేఖరరావు వాగ్దానం చేశారు. అధికారంలోకి వచ్చి 40 నెలలు పూర్తయినా ఇప్పటి వరకు వాటి ఉనికి కనిపించడం లేదు. 2015 దసరా నాడు ఆర్భాటంగా అన్ని జిల్లాల్లో ఈ గృహాలకు శంకుస్థాపనలు చేశారు. సంవత్సరంలోగా హైదరాబాద్‌లో ఒక లక్ష, మిగిలిన జిల్లాల్లో మరో లక్ష గృహాల నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. అయితే రెండేళ్లు దాటినా ఇప్పటి వరకు 18 జిల్లాల్లో ఈ గృహాల ప్రస్తావనే కనిపించడం లేదు. ఒక ఇంటికి కూడా గృహప్రవేశం చేసిన దాఖలాలు లేవు.

కేవలం ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట జిల్లాలో, హైదరాబాద్‌లో తప్ప ఈ గృహాల నిర్మాణం మరెక్కడా కనిపించడం లేదు. గత సంవత్సరం జనవరిలో గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఒక సంవత్సరంలోగా ఒక లక్ష ఇండ్లు నిర్మించి ఇస్తామన్నారు. కానీ ఒక్క ఇంటినీ ఇంకా పూర్తి చేయలేదు. ఇప్పటికే శంకు స్థాపనలు జరిగిన అనేక గృహాలు 2019 ఎన్నికల లోపు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. గృహ నిర్మాణాలు పూర్తి చేసేందుకు కాంట్రాక్టుదారులకు ప్రభుత్వం ఎన్నో రాయితీలు కల్పిస్తున్నా తమకు గిట్టుబాటు కావాలంటూ వెనుకడుగు వేస్తున్నారు. ఉచితంగా ఇసుక ఇస్తున్నారు. తక్కువ ధరకు సిమెంట్, ఇనుము ఇప్పిస్తున్నారు. పలు చోట్ల మంత్రులు కాంట్రాక్టుదారులతో సమావేశమై తరచూ సమాలోచనలు జరుపుతున్నారు. అయినా చెప్పుకోదగిన ఫలితం కనబడటం లేదు. 18 జిల్లాల్లో ఒక్క ఇల్లు కూడా పూర్తి కాలేదు. తాజా నివేదికల ప్రకారం గత సంవత్సరమే లక్ష గృహాల నిర్మాణం పూర్తి చేస్తామంటూ నగర పాలక సంస్థలో అధికారం చేపట్టిన హైదరాబాద్‌లో ఇప్పటికి కేవలం 40,362 గృహాల పనులు మాత్రమే మొదలు పెట్టారు. లక్ష ఇళ్లకు గాను 90,104 గృహాలకు పరిపాలనపర అనుమతి ఇచ్చారు. 69,564 ఇళ్లకు మాత్రమే టెండర్లు ఖరారు చేశారు.




**తెలంగాణ మొత్తం మీద 2.68 లక్షల గృహాలను మంజూరు చేయగా నిర్మాణానికి పరిపాలన అనుమతులు ఇచ్చింది 2.06 లక్షల గృహాలకు మాత్రమే. వీటిల్లో 1.79 లక్షల గృహాలకు టెండర్లు పిలువగా, 1.19 లక్షల గృహాలకు ఖరారు చేశారు. వీటిల్లో 68,567 గృహాలకు పనులు ప్రారంభం కాగా కేవలం 2,771 గృహాల నిర్మాణం పూర్తి చేయగలిగారు. అంటే మంజూరు చేసిన గృహాలలో నాల్గవ వంతు గృహాలకు మాత్రమే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కేవలం 1 శాతం గృహాల నిర్మాణమే పూర్తయింది.**

ఇక సిద్దిపేటలో 11,960 ఇండ్లు కేటాయించగా 10,647 ఇండ్లకు అనుమతి ఇచ్చారు. వాటిల్లో 8,137 ఇండ్లకు మాత్రమే పనులు ప్రారంభించారు. టెండర్లు ఖరారు కావడమే ప్రామాణికంగా జాబితాలు సిద్ధం చేస్తున్నా పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. కొత్తగా శంకుస్థాపనలు జరిపిన కొత్త జిల్లా కలెక్టర్ కార్యాలయాల నిర్మాణం వచ్చే సంవత్సరం దీపావళికి పూర్తవుతాయని చెబుతున్నా రెండేళ్ల క్రితం చేపట్టిన రెండు పడకల గృహాల నిర్మాణం ఎప్పుడు పూర్తవుతాయో మాత్రం చెప్పలేక పోతున్నారు.

ముఖ్యమంత్రి నియోజకవర్గం గజ్వేల్‌లో, తాను దత్తత తీసుకున్న నరసన్నపేటలో మంత్రి టి.హరీష్ రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కృషి చేయడంతో గృహ నిర్మాణాలను పూర్తి చేసి, గృహప్రవేశాలు కూడా చేశారు. మిగిలిన నియోజకవర్గాలలో ఎక్కడా అంత పట్టుదలగా ఈ గృహాల నిర్మాణం చేపట్టినట్టు కనిపించడం లేదు. ఇప్పటి వరకు తెలంగాణ మొత్తం మీద 2.68 లక్షల గృహాలను మంజూరు చేయగా నిర్మాణానికి పరిపాలన అనుమతులు ఇచ్చింది 2.06 లక్షల గృహాలకు మాత్రమే. వీటిల్లో 1.79 లక్షల గృహాలకు టెండర్లు పిలువగా, 1.19 లక్షల గృహాలకు ఖరారు చేశారు. వీటిల్లో 68,567 గృహాలకు పనులు ప్రారంభం కాగా కేవలం 2,771 గృహాల నిర్మాణం పూర్తి చేయగలిగారు. అంటే మంజూరు చేసిన గృహాలలో నాల్గవ వంతు గృహాలకు మాత్రమే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కేవలం 1 శాతం గృహాల నిర్మాణమే పూర్తయింది. ఈ విధంగానే కేసీఆర్ ఎన్నికల వాగ్దానాలు నీరుగారి పోతున్నాయి. యువతకు ఉపాధి హామీ అన్న నేతలు కనీసం ప్రభుత్వంలో ఉన్న ఉద్యోగ ఖాళీలను కూడా భర్తీ చేయడం లేదు. దళితులకు మూడెకరాల భూపంపిణీ అటకెక్కించారు. కేజీ టూ పీజీ ఉచిత విద్యను గాలికి వదిలేశారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ ప్రస్తావననే మరిచిపోయింది.

అధికార నివాసం దాటి చాలా అరుదుగా బయటకు వచ్చే ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు రోజుకో కొత్త ప్రకటనలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేయడం మినహా ఇచ్చిన హామీల అమలును పట్టించుకోవడం లేదు. కీలకమైన హామీలను గాలికి వదిలేసి ఉన్న సచివాలయాన్ని కూలగొట్టి మరో కొత్త సచివాలయం నిర్మిస్తానంటూ ప్రజలను ఊహల ప్రపంచంలో ముంచెత్తే ప్రయత్నం చేస్తున్నారు. ■



విశ్లేషణ

# ప్రశ్నార్థకంగా నాగార్జునసాగర్, శ్రీశైలం జలాలు!

● చలసాని నరేంద్ర

కృష్ణా జలాల పంపిణీ రెండు తెలుగు రాష్ట్రాల మధ్య తరచూ వివాదాలకు కారణంగా మారింది. ఈ సంవత్సరం ఖరీఫ్ సాగుకు కృష్ణా జలాలను ఉపయోగించుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. కేవలం తాగునీటి కోసం కొద్దో, గొప్పో విడుదల చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను సస్యశ్యామలం చేసి ఆధునిక దేవాలయంగా కీర్తి అందుకున్న నాగార్జున సాగర్ ప్రాజెక్టు, జలవిద్యుత్ రంగానికి దిక్సూచిగా ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు భవిష్యత్తు అయోమయంలో పడటమే అందుకు ప్రధాన కారణం.

ఈ రెండూ ప్రస్తుతానికి నీటి నిల్వ చేసే డ్యాములుగా మారిపోయాయి. రానున్న రోజుల్లో మహాద్భుతం జరిగి భారీ వర్షాలు పడితే తప్ప నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వచ్చే నీటి ప్రవాహం ఏమీ ఉండదని అర్థమై పోతోంది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వదిలే నీటిని ఒడిసిపట్టి కుడి, ఎడమ కాల్వల ద్వారా తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు రెండు కోట్ల జనాభాకు మంచినీటిని సరఫరా మాత్రమే చేసే రిజర్వాయర్‌గా సాగర్ మారిపోయింది.

ఈ ఏడాది నాగార్జునసాగర్ ఆయకట్టు కింద రెండు రాష్ట్రాల్లో ఉన్న 22 లక్షల ఎకరాలకు ఖరీఫ్, రబీ లేదని కృష్ణా బోర్డు కరాఖండిగా తేల్చి చెప్పడం తెలిసిందే. అయితే అక్టోబర్‌లో కుంభవృష్టి కురవడంతో రబీకి సాగునీటికి ఢోకా లేని పరిస్థితులు నెలకొన్నాయి. గత నెల్లో కురిసిన వర్షాలతో కృష్ణా నదిలో చేరిన నీటిని రెండు రాష్ట్రాలూ వచ్చే ఏడాది వరకు సద్వినియోగం చేసుకొనే అవకాశం లభించింది.

శ్రీశైలం నీటిమట్టం 882 అడుగులకు చేరడంతో పాటు నాగార్జునసాగర్, పులిచింతల తదితర ప్రాజెక్టులు నీటితో కళకళలాడు తున్నాయి. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం అవగాహనతో, సహకారంతో వ్యవహరిస్తే వచ్చే ఏడాదికి సాగునీటి సమస్యలను చాలావరకు అధిగమించే అవకాశం ఉంది. అయితే ప్రతి సంవత్సరం పరిస్థితులు ఇదేవిధంగా ఉండే అవకాశాలు లేవు.

వర్షాలు ప్రారంభమయ్యే వరకు ఈ ఏడాది జూరాల నుంచి శ్రీశైలం వరకు వచ్చిన నీటి ప్రవాహం కేవలం 150 టీఎంసీలు మాత్రమే. ఇందులో ఆవిరి కింద కొంతపోను, దిగువకు విడుదల చేస్తున్న జలాల తరువాత 131 టీఎంసీకి చేరుకొంది. దీంతో నీటిని హేతుబద్ధంగా ఉపయోగించడంపై కృష్ణా బోర్డు కసరత్తు చేయాల్సి వచ్చింది. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు రాగద్వేషాలకు అతీతంగా వాస్తవిక దృష్టితో వ్యవహరించాల్సి ఉంది.

శ్రీశైలం ప్రాజెక్టుకు తుంగభద్ర జలాలు వస్తాయి. ఆ నది నీటి పరీవాహక ప్రాంతం రాయలసీమలో ఉంది. శ్రీశైలం ప్రాజెక్టులో నీటి మట్టం 854 అడుగులకు తగ్గకుండా చూడాలని కృష్ణా బోర్డు ఆదేశాలు జారీ చేసింది. కాని ఆచరణలో అమలు సాధ్యం కావడం లేదు. నాగార్జున సాగర్ నుంచి మంచినీటిని హైదరాబాద్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలకు సరఫరా చేయాల్సి ఉంది. ఇప్పటికే ఈ జిల్లాల్లో నీటి కటకట ఏర్పడింది. శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేయాలని కోరితే ఏపీ ప్రభుత్వం అంగీకరించని పరిస్థితి నెలకొనడంతో తెలంగాణ జల విద్యుదుత్పత్తి చేసి దిగువకు నీటిని వదిలింది. వర్షాలు రావడంతో ఈ సమస్య తాత్కాలికంగా పరిష్కారమైనట్లు చెప్పవచ్చు.

**శ్రీశైలంలో 854 అడుగులు, నాగార్జునసాగర్‌లో 510 అడుగుల నీటి మట్టం తగ్గకుండా చూడాలన్న కృష్ణా బోర్డు ఆదేశాలు అమలయ్యేలా చూడటం కష్టంగా మారే అవకాశాలున్నాయి. ఎగువన అనధికార ప్రాజెక్టులు, నీటి నిల్వలు పెరుగుతూ ఉండడంతో కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా తెలుగు రాష్ట్రాలకు లభించడం లేదు. ఆ వాటా కోసం రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ప్రయత్నం చేయాల్సింది పోయి, పరస్పరం వివాదాలకు దిగుతూ ఉండడం వల్ల ప్రయోజనం ఉండదు.**

కృష్ణా డెల్టాకు పట్టిసీమ నుంచి గోదావరి జలాలను సరఫరా చేయడం వల్ల అక్కడ ఉన్న పంటను ఆంధ్ర ప్రభుత్వం కాపాడింది. నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వచ్చేసరికి నీటి విడుదల నిర్వహణ తెలంగాణ ప్రభుత్వ ఆధీనంలో ఉంది. ఈ పరిస్థితుల్లో ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు సమష్టిగా నీటి వినియోగంపై ఒక అవగాహనకు రాని పక్షంలో వివాదాలకు అంతు ఉండదు.

ఉమ్మడి ప్రాజెక్టులపై యాజమాన్య హక్కులను కృష్ణా బోర్డుకు ఇవ్వకపోవడం వల్ల శ్రీశైలం ప్రాజెక్టులో లభ్యతలో ఉన్న నీటిని ఎడాపెడా రెండు రాష్ట్రాలు వాడుతుండటంతో 854 అడుగుల దిగువకు నీటి మట్టం పడిపోయి పరిస్థితులు విషమించే అవకాశాలు తరచూ ఏర్పడుతున్నాయి. శ్రీశైలంలో 854 అడుగులు, నాగార్జునసాగర్‌లో 510 అడుగుల నీటి మట్టం తగ్గకుండా చూడాలన్న కృష్ణా బోర్డు ఆదేశాలు అమలయ్యేలా చూడటం కష్టంగా మారే అవకాశాలున్నాయి. ఎగువన అనధికార ప్రాజెక్టులు, నీటి నిల్వలు పెరుగుతూ ఉండడంతో కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా తెలుగు రాష్ట్రాలకు లభించడం లేదు. ఆ వాటా కోసం రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ప్రయత్నం చేయాల్సింది పోయి, పరస్పరం వివాదాలకు దిగుతూ ఉండడం వల్ల ప్రయోజనం ఉండదు.

2015 ఆగస్టు నెలలో కృష్ణా బోర్డు నీటి వినియోగంపై మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మార్గదర్శకాలను తాజాగా సవరించి విడుదల చేస్తూ ఇరు రాష్ట్రాలు నీటిని మంచినీటి అవసరాలకు మాత్రమే వినియోగించుకోని పక్షంలో తీవ్రమైన ఇక్కట్లు ఎదుర్కొనే పరిస్థితులు ఉంటాయని నర్మగర్భంగా హెచ్చరించింది. మొత్తం 30 మార్గదర్శకాలను కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖకు పంపింది. కృష్ణా జల వివాద ట్రిబ్యునల్ ఇచ్చే తీర్పునకు లోబడి కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ నోటిఫై చేసే ఆపరేషన్ ప్రోటోకాల్ నిబంధనలను రెండు రాష్ట్రాలు అతిక్రమించరాదు.

ఉమ్మడి ఆంధ్రలో కుదిరిన ఒప్పందాల మేరకు ప్రాజెక్టులకు నీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి. నీటి వినియోగంలో తొలుత మంచీనీరు, తర్వాత సాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలి. అపెక్స్ కౌన్సిల్ సమావేశం అనుమతి లేకుండా కొత్త ప్రాజెక్టులను నిర్మించరాదని కృష్ణా బోర్డు పేర్కొంది. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కృష్ణా జలాల వినియోగంలో పరస్పరం విమర్శలకు దిగకుండా, ఉమ్మడిగా ఎగువ ప్రాంతంలో అక్రమ వినియోగాన్ని కట్టడి చేయడంపై దృష్టి సారించాల్సి ఉంది. ■

వర్తమానం

# రైతు ఆత్మహత్యలు కేసీఆర్‌కు కనిపించవా..?

రాష్ట్రంలో పత్తి, వరి, ఇతర పంటలు తీవ్ర నష్టానికి గురై రైతులు ఆత్మహత్యలు చేసకొంటున్నప్పటికీ ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు డా॥ నాగం జనార్దన్ రెడ్డి విమర్శించారు. రైతులు కష్టనష్టాలకు తీర్చడంలో ఈ ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందని దుమ్మెత్తి పోశారు.

వేల ఎకరాలలో పత్తి, వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పంటనష్టం అంచనా వేయడానికి ప్రత్యేక బృందాలను పంపాలని, కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపితే కేంద్రం నుండి సహాయం అందేలా ప్రయత్నిస్తామని అన్నారు. పంటనష్టం అంచనా వేయడానికి బిజెపి బృందాలు అన్ని జిల్లాల్లో పర్యటిస్తున్నాయని, తాము నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పర్యటించామని తెలిపారు. రైతుల పరిస్థితి హృదయవిదారకంగా ఉందని, వారిని ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కపెట్టడం రైతుల పట్ల టీఆర్ఎస్ ప్రభుత్వానికి ఉన్న అశ్రద్ధకు అద్దం పడుతుందన్నారు.

ముఖ్యమంత్రి, మంత్రులు వెంటనే రైతులను కలిసి వారి కష్టాలను, పంట నష్టాలను తెలుసుకోవాలని నాగం డిమాండ్ చేశారు. పంట పెట్టుబడి కోసం రైతులు మంగళసూత్రాలు అమ్ముకొన్నారని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనపై రైతులకు అహగాహన కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. పంట బీమా చేయిస్తే ప్రధానికి పేరు వస్తుందన్న దుగ్ధతో రాష్ట్రంలో



రైతులకు బీమా చేయించకపోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు.

బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి, మార్కెటింగ్ శాఖ మంత్రి హరీష్‌రావు రాజకీయాలు ఎక్కువ మాట్లాడుతూ తమ శాఖలను మరచిపోతున్నారని విమర్శించారు. దమ్ముంటే ఇద్దరు మంత్రులు వ్యవసాయ మార్కెట్లకు రావాలని, రైతులకు ఎక్కడ సరైన ధర లభిస్తుందో చూపాలన్నారు. రైతుల సమస్యలు పరిష్కారంలో విఫలమైన మంత్రులు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**-జనసందేశ్ ప్రతినిధి**

## గమనిక

పాఠకుల సౌలభ్యం కోసం జనసందేశ్ పక్ష పత్రిక ఈ-మ్యాగజైన్ రూపంలోనూ అందుబాటులోకి వచ్చింది. http://www.bjptelangana.org/ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి జనసందేశ్(ఈ-బుక్) ట్యాబ్‌ను ప్రెస్ చేస్తే గత 10 సంచికలకు సంబంధించిన తేదీలు కనిపిస్తాయి. కావాల్సిన సంచికను ఎంచుకొని క్లిక్ చేస్తే ఈ-మ్యాగజైన్ తెరుచుకుంటుంది. అవసరమైతే పాఠకులు ఈ ఈ-మ్యాగజైన్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తర్వాత కూడా చదువుకోచ్చు.

-ఎడిటర్

## హెచ్ఎండీఏకు పన్ను మినహాయింపు

ట్రిబ్యునల్ తీర్పు ద్వారా హెచ్ఎండీఏకు రూ.983 కోట్ల ఆదాయపన్ను మినహాయింపు లభించడాన్ని బిజెపి తెలంగాణ స్వాగతిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఆదాయపన్ను మినహాయింపు నిస్తూ, హెచ్ఎండీఏకు పెద్ద ఊరట నిచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది. ప్రభుత్వ భూములను బహిరంగ వేలం వేయడంతో సుమారు రూ.2,600 కోట్ల ఆదాయం ఈ సంస్థకు వచ్చింది. దానికి ఆదాయపు పన్ను శాఖ అధికారులు రూ.750 కోట్ల ఆదాయపన్ను విధించారు. ప్రభుత్వ భూముల అమ్మకం ద్వారా వచ్చినటువంటి ఆదాయానికి పన్ను విధించడం సబబు కాదని కేంద్ర ప్రభుత్వం మధ్యవర్తిత్వం వహించి ట్రిబ్యునల్ ద్వారా ఈ మినహాయింపు లభించేలా కృషి చేసింది.

గత 2005 నుండి 2017 వరకు సుమారుగా 5 వేల కోట్ల రూపాయల ఆర్థిక వనరులపై వడ్డీ రూపేణా హెచ్ఎండీఏ బకాయి పడింది. ఇంతవరకు హెచ్ఎండీఏకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన గ్రాంట్లు గానీ, నిధులు గానీ ఇవ్వడం లేదు. కేవలం విధులకు మాత్రమే హెచ్ఎండీఏను పరిమితం చేశారు.

జీహెచ్ఎంసీ ద్వారా రూ.1,500 కోట్లు ఆస్తిపన్ను రూపేణా, అభివృద్ధి పన్నుల రూపేణా 10 శాతం హెచ్ఎండీఏకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి. గత 10 సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. ఫ్లైఓవర్లు, ఓఆర్ఆర్‌లు, పార్కులు, ప్లేగ్రౌండ్లకు సంబంధించి హెచ్ఎండీఏకు రాష్ట్ర ప్రభుత్వం నుండి ఒక్క రూపాయి కూడా రాలేదు. నిధులలేమితో హెచ్ఎండీఏ నిర్వీర్యమయ్యే ప్రమాదం పొంచి ఉంది. ప్రతిష్ఠాత్మకమైన హెచ్ఎండీఏను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. హెచ్ఎండీఏకు స్వయం ప్రతిపత్తి ఇచ్చి, నగరం చుట్టుపక్కలా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని బిజెపి డిమాండ్ చేస్తుంది. హెచ్ఎండీఏకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన గ్రాంటులో ఇంతవరకు ఎంత ఇచ్చారో తెలంగాణ ప్రభుత్వం శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని బిజెపి డిమాండ్ చేస్తుంది.

**-జనసందేశ్ ప్రతినిది**

 ఈ భూమ్మీద జన్మచేత ఎవరూ అధికులు కారు. బహిరింద్రియ నిగ్రహం కలవారే ఇతరులకన్నా అధికులు, ఉత్తములు. – శ్రీ జ్యోతిరావు పూలే

మనమాట

# మతపరమైన రిజర్వేషన్లపై కేసీఆర్ మోసపూరిత ప్రకటనలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముస్లిం రిజర్వేషన్లు సమర్థించినట్లుగా తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అసెంబ్లీలో మాట్లాడటంపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమని ఖండించారు. తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించడానికే ఇలాంటి మోసపూరిత ప్రకటన చేశారని దుయ్యబట్టారు.

ముస్లిం రిజర్వేషన్లపై కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడుతూ ఒకసారి నరేంద్ర మోదీ సమర్థించారని, మరోసారి పార్లమెంట్‌లో పోరాడుతామని, ఇంకోసారి అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లయినా 12 శాతం ముస్లిం రిజర్వేషన్లను సాధిస్తామంటూ పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేయడం దురదృష్ట కరంగా అభివర్ణించారు. మతపరమైన రిజర్వేషన్లకు ఆస్కారం లేదని డా॥ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నారని గుర్తు చేశారు. రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తున్న టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల ఓటుబ్యాంకు రాజకీయాలను బిజెపి మొదటి నుంచీ వ్యతిరేకిస్తుందని తెలిపారు. మతపరమైన రిజర్వేషన్లను 4 శాతం నుండి 12 శాతం ఇవ్వాలని అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని బిజెపి వ్యతిరేకిస్తుందని కుండబద్ధలు కొట్టారు.

తెలంగాణ ప్రజలు చాలా చైతన్యవంతులని, నిజాంను కీర్తించే పార్టీలను వచ్చే ఎన్నికల్లో ఏం చేయాలో బాగా తెలుసని తెలిపారు. టీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలను తిరస్కరించి బిజెపిని సమర్థించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో 'సెప్టెంబర్ 17ను అధికారికంగా ఎందుకు నిర్వహించరని' ప్రశ్నించిన కేసీఆర్, అధికారంలోకి వచ్చిన తరువాత 'గత ప్రభుత్వాలు మాదిరిగానే' అధికారికంగా ఉత్సవాలను నిర్వహించకుండా ద్వంద్వ నీతిని ప్రదర్శించారని నిప్పులు చెరిగారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని బిజెపి తెలంగాణవ్యాప్తంగా 'తెలంగాణ విమోచన యాత్ర'ను నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ వ్యవహార శైలిని ఎండగట్టిందని తెలిపారు. నిజాంను కీర్తిస్తున్న ఈ పార్టీలను, నాయకుల నైజాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లామని స్పష్టం చేశారు.

అక్బరుద్దీన్ ఓవైసీ ఆరు నెలల ముందు ముఖ్యమంత్రిపై వ్యంగ్యంగా మాట్లాడిన విషయాన్ని మరిచి, ఈ అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రిని పొగడ్తలతో ముంచెత్తడం వెనుక 'క్విడ్ ప్రో కో' జరిగిందన్న అనుమానాలు వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి అధికారమే పరమావధి అని, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీతో అంటకాగడమే ఎంఐఎం నైజమని అన్నారు. ఎంఐఎంకు రాజకీయ భవిష్యత్తు లేదని, ఏ స్థాయికైనా దిగజారుతుందని విమర్శించారు. ముఖ్యమంత్రిని పొడగ్తలతో ముంచెత్తడం వల్ల మజ్లిస్ నేతలు మనగలుగుతున్నారని అన్నారు. పొగడ్తలు ముఖ్యమంత్రికి కడుపు నింపినా, నిరుద్యోగులు కడుపు మంటతో రగిలి పోతున్నారని తెలిపారు. నిజాం మహాప్రభువని ముఖ్యమంత్రి కీర్తించడం, చరిత్రను తిరగరాస్తా మంటూ వక్రీకరించే ప్రయత్నం చేయడం తెలంగాణ ప్రజలను అవమానపర్చడమే అవుతుందన్నారు. తెలంగాణ విముక్తి పోరాటం లో పాల్గొన్న త్యాగధనులను అవమానించే విధంగా చరిత్రను ఎలా వక్రీకరిస్తారో ముఖ్యమంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు.

టీఆర్ఎస్ 'కారు' అధికారంలో ఉన్నా, 'కారు స్టీరింగ్' మా చేతుల్లోనే ఉందని చెప్పిన ఎంఐఎం ఇప్పుడు ముఖ్యమంత్రిని పొగడ్తలతో ముంచెత్తడం ద్వారా వారి రాజకీయ అనైతికతను బయట పెట్టుకుందన్నారు. తెలంగాణ ఏర్పాటు ను ఎంఐఎం వ్యతిరేకించిందన్న వాస్తవాన్ని ప్రజలు మర్చిపోలేదని తెలిపారు. "నిజాం గొప్ప ప్రభువు అంటున్నారు.. తెలంగాణ ఆడపడుచు లతో నగ్నంగా బతుకమ్మ ఆడించినందుకా? నిజాం ధనవంతుడని కీర్తిస్తున్నారు.. కాయం కష్టం చేసిన రైతులను దోచుకున్నందుకా? కొమరం భీమ్ వంటి గిరిజన యోధుడిని చంపినందుకా? పరకాల, భైరాన్‌పల్లి, అప్పంపల్లి లో జలియన్‌వాలాబాగ్ తరహాలో నిజాం సైన్యం దమనకాండ సాగించినందుకా? మాతృభాష తెలుగును రద్దుచేసి, ఉర్దూను బలవంతంగా రుద్దినందుకా? దాశరథిలాంటి రచయితలను జైల్లో పెట్టినందుకా? నిజాంపై పోరాటం చేసి ఎంతోమంది అసువులు బాసినందుకా?" అంటూ నిప్పులు చెరిగారు.

"70 వేల పుస్తకాలు చదివానని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు 'ఓ నిజాం పిశాచమా' అని బొగ్గుతో జైలు గోడలపై దాశరథి రాసిన విషయం, బండెనుక బండి కట్టి 16 బండ్లు కట్టి.... అని బండి యాదగిరి పాడిన పాట; నిజాంను వ్యతిరేకిస్తూ పాటలు రాసిన సుద్దాల హనుమంతు; ఇమ్రోజ్ పత్రిక అధినేత షోయబుల్లాఖాన్ లాంటి వారి చరిత్ర తెలియదా? ఇలాంటి పుస్తకాలు చదవలేదా?" అని ప్రశ్నించారు. ఈ పుస్తకాలను ముఖ్యమంత్రికి పంపిస్తామని, వాటిని చదివి చరిత్ర తెలుసుకోవాలంటూ కేసీఆర్‌కు డా॥ లక్ష్మణ్ చురకలంటించారు.

**-జనసందేశ్ ప్రతినిధి**



దోమపోటుతో నష్ట పోయిన రైతుల పంటపొలాలకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గం నేరేడుచర్ల మండలంలో బిజెపి నేతలు ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కొణతం సత్యనారాయణ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొబ్బా భాగ్యరెడ్డి, చంద్రారెడ్డి, వీరయ్య, నరినాయక్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రాము, నాగేశ్వర్ రావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు వెయ్యి కోట్లు కేటాయించాలి!




దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్‌లో వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. శాసనసభ సమావేశాల సందర్భంగా దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు నవంబర్ 15న డా॥ లక్ష్మణ్ నేతృత్వంలో బిజెపి ఎమ్మెల్యేలు, వందలాది మంది దివ్యాంగులు పాదయాత్ర చేపట్టారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం నుండి రాష్ట్ర శాసనసభ వరకు పాదయాత్రను కొనసాగించే ప్రయత్నం చేయగా, పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా డా॥ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి 90 శాతం సబ్సిడీ నిధులు కేటాయిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద 10 శాతం నిధులు కేటాయించకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. దివ్యాంగుల పట్ల ఈ ప్రభుత్వం కనీస మానవతను చూపించడం లేదని విమర్శించారు.

రాష్ట్రంలో 20 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారని, వారిలో చాలామంది ఉద్యోగాల కొరకు ఎదురు చూస్తున్నా ప్రభుత్వం మాత్రం నియామకాలు జరపడం లేదని విమర్శించారు. ఉద్యోగాలు చేస్తున్న దివ్యాంగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. దివ్యాంగుల స్వయం ఉపాధి కోసం 100 శాతం ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల వసతి గృహాలు ప్రైవేట్ ఇండ్లలో ఉంటున్నాయని, కనీస సౌకర్యాలు కరువయ్యాయని, మంచినీరు కూడా దొరకని పరిస్థితి ఉందని లక్ష్మణ్ ఆవేదన చెందారు. దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత వసతి భవనాలు నిర్మించాలని, కనీస వసతి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డా॥ లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బిజెపి శాసనసభ పక్షనేత జి.కిషన్ రెడ్డి, ఎమ్మెల్యేలు చింతల రామచంద్రా రెడ్డి, ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్, రాజా సింగ్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి పాపారావు, వికలాంగుల విభాగం నాయకులు శ్రీశైలం, బిజెపి అధికార ప్రతినిధి శ్రీ ఎన్.వి.సుభాష్, రాష్ట్ర మీడియా కమిటీ కన్వీనర్ వి.సుధాకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

–జనసందేశ్ ప్రతినిధి



# సూర్యాపేట కలెక్టరేట్ నిర్మాణంలో కుంభకోణం

సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సముదాయం నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణలో పెద్ద కుంభకోణం ఉందని ఆరోపిస్తూ, టీఆర్ఎస్ నాయకుల ఒత్తిడి మేరకు ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నా ప్రైవేట్ భూములు సేకరించడాన్ని వ్యతిరేకిస్తూ జిల్లా అఖిలపక్ష నేతలు నవంబర్ 16న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ అఖిలపక్ష బృందంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర రావు, కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే దామోదర్ రెడ్డి, టీడీపీ, వామపక్షాలు, ఇతర జేఏసీ నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా డా॥ లక్ష్మణ్ మాట్లాడుతూ.. జిల్లా కలెక్టరేట్ భవనాల సముదాయానికి సంబంధించి కుంభకోణం జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని, స్థానిక నేతలు కోరినా, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఈ వ్యవహారంలో జిల్లాకు చెందిన ఓ మంత్రి ప్రమేయం ఉందనే ఆరోపణలు వస్తున్నాయని, అయినా ప్రభుత్వం మొండిగా టీఆర్ఎస్ నాయకులకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరిస్తున్నదనే అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. అనేక జిల్లాల్లోనూ ఇలాంటి ఆరోపణలే వస్తున్నాయని డా॥ లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

–జనసందేశ్ ప్రతినిధి



# క్యాబ్‌లో అసెంబ్లీకి

క్యాబ్ డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు నవంబర్ 6న ఉప్పల్ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు ప్రైవేట్ క్యాబ్‌లో వచ్చారు. రామంతపూర్‌లోని తన నివాసం నుంచి పాదయాత్రగా బయలుదేరి, అనంతరం క్యాబ్‌లో అసెంబ్లీకి చేరుకున్నారు. దీనిపై ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ స్పందిస్తూ క్యాబ్ డ్రైవర్లకు న్యాయం చేస్తామంటూ గత అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి మహేందర్ రెడ్డి చెప్పారని, ఇంతవరకు ఆ విషయాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. అందుకే క్యాబ్‌లో వస్తూ క్యాబ్ డ్రైవర్ల సమస్యల గురించి తెలుసుకున్నానని చెప్పారు. క్యాబ్ డ్రైవర్ల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుకుంటోందని విమర్శించారు. క్యాబ్ డ్రైవర్లకు రావాల్సిన కమిషన్లు ఇవ్వకుండా, యాజమాన్యాలు అన్యాయం చేస్తున్నాయని, ప్రశ్నించిన వారిపై పోలీసుల వేధింపులు కూడా ఎక్కువయ్యాయన్నారు. క్యాబ్ డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

–జనసందేశ్ ప్రతినిధి

### మూడీస్ రేటింగ్ పెరుగుదల:

# సత్ఫలితాలిస్తోన్న మోదీ సంస్కరణలు

మోదీ ప్రభుత్వం తీసుకొన్తున్న వరుస సంస్కరణలు సత్ఫలితాలిస్తున్నాయి. అంతర్జాతీయ రేటింగ్ సంస్థ మూడీస్ ఇన్వెస్టర్స్ భారత సార్వభౌమ రేటింగ్‌ను పెంచింది. భారత రేటింగ్‌ను 'బీఏఏ3 నుంచి బీఏఏ2కు సవరించింది. మూడీస్ రేటింగ్ పెరగడం గత 13 ఏళ్లలో ఇదే తొలిసారి. ఆర్థిక, సంస్థాగత సంస్కరణలు కొనసాగడం వల్ల వృద్ధి అవకాశాలు మెరుగయ్యాయని ఆ సంస్థ తేల్చి చెప్పింది. పెరుగుతున్న రుణాలను సంస్కరణలు స్థిరీకరిస్తాయని పేర్కొంది.

ఇప్పటిదాకా అత్యంత తక్కువ పెట్టుబడి ర్యాంకు ఉన్న భారత్ తాజా పెంపుతో ఫిలిప్పీన్స్, ఇటలీ, స్పెయిన్, బల్గేరియా దేశాల సరసన చేరింది. చివరిసారిగా 2004లో భారత సార్వభౌమ రుణ రేటింగ్‌ను బీఏ1 నుంచి బీఏఏ3కు పెంచారు. 'చెత్త'(జంక్) స్థాయికి ఇది ఒక మెట్టు ఎక్కువ. ప్రస్తుతం ఇచ్చిన బీఏఏ2కు అర్థం.. ఒక మోస్తరు రుణ నష్టభయం ఉన్నట్లు లెక్క. సులువుగా వ్యాపారాన్ని నిర్వహించుకునే దేశాల జాబితాలో సైతం ఏకంగా 30 స్థానాలు ఎగబాకి తొలిసారిగా 100వ ర్యాంకుకు భారత్ చేరుకున్నట్లు ప్రపంచ బ్యాంకు ప్రకటించిన కొద్ది వారాల వ్యవధిలోనే ఈ రేటింగ్ పెంపు చోటు చేసుకోవడం విశేషం.

భారత రుణ రేటింగ్‌తో పాటు తొమ్మిది ప్రభుత్వ రంగ సంస్థల రేటింగ్‌ను సైతం పెంచుతున్నట్లు మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ ప్రకటించింది. రేటింగ్ పెంచుకున్న సంస్థల జాబితాలో 1.ఓఎన్‌జీసీ 2.ఐఓసీ 3.బీపీసీఎల్ 4.హెచ్‌పీసీఎల్ 5.ఎన్‌టీపీసీ 6.గెయిల్ 7.పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ 8.ఎన్‌హెచ్‌పీసీ 9.ఎన్‌హెచ్ఏఐలున్నాయి.

- ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీ, ఎన్‌హెచ్‌పీసీ, ఎన్‌హెచ్ఏఐ, గెయిల్ ఇండియాల రేటింగ్‌ను బీఏఏ2 నుంచి బీఏఏ1కు పెంచింది. భవిష్యత్ అంచనాను స్థిరంగా ఉంచింది.
- దేశంలోని ఇంధన రిఫైనింగ్ సంస్థల్లో బీమా భాగాన్ని నిర్వహిస్తున్న ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ వ్యూహాత్మక ప్రాధానాన్ని ఆయా సంస్థల రేటింగ్ పెంపు ప్రతిఫలిస్తోందని మూడీస్ పేర్కొంది.
- విదేశీ కరెన్సీ బాండ్ల పరిమితి పెంపు నేపథ్యంలో ఓఎన్‌జీసీ రేటింగ్‌ను పెంచినట్లు ఆ ఏజెన్సీ తెలిపింది.
- ఇక ఎన్‌టీపీసీ, ఎన్‌హెచ్‌పీసీ, ఎన్‌హెచ్ఏఐ, గెయిల్ ఇండియాలకు ప్రభుత్వంతో ఉన్న నిర్వహణ, ఆర్థిక బంధానికి తోడు.. సార్వభౌమ రేటింగ్ పెంపు సైతం ఆయా కంపెనీల రేటింగ్ పెంపునకు దోహదం చేసిందని మూడీస్ వివరించింది.

నాలుగు ఆర్థిక సంస్థల దీర్ఘకాల రేటింగ్‌లను సైతం మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ పెంచింది. ఎగ్జిమ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ), ఎస్‌బీఐల రేటింగ్‌ను సవరించింది. ఇందులో ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ల రేటింగ్ బీఏఏ2కు పెంచింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విషయంలో బ్యాంకు ప్రాతిపదిక రుణ మదింపును సైతం బీఏఏ3 నుంచి బీఏఏ2కు సవరించింది.

**–జనసందేశ్ ప్రతినిధి**





"సంస్కరణల అజెండాను కొనసాగిస్తాం. మధ్యకాలంలో ద్రవ్య స్థిరీకరణనూ కొనసా గిస్తాం. రేటింగ్ పెంపును మేం ఆహ్వానిస్తాం. ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి గత కొన్నేళ్లలో తీసుకున్న సానుకూల చర్యలకు కొంత ఆలస్యంగా గుర్తింపు లభించిందని మేం విశ్వసిస్తాం. 13 ఏళ్ల తర్వాత రేటింగ్ పెంపును పొందిన నేపథ్యంలో సంస్కరణలపై అనుమా నాలున్న వారు ఆత్మావలోకనం చేసుకోవాలి."

**–అరుణ్ జైట్లీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి**

## వృద్ధికి కారణం

- ఇటీవల అమలు చేసిన వస్తువులు, సేవల పన్ను(జీఎస్‌టీ), పరపతి విధాన వ్యవస్థలో మార్పులు, మొండి బకాయిలను ప్రక్షాళించడానికి తీసుకున్న చర్యలు తదితరాలు రేటింగ్ పెంపునకు దోహదం చేశాయని మూడీస్ వ్యాఖ్యానించింది.
- 'ఆర్థిక, సంస్థాగత సంస్కరణల్లో ప్రగతి కొనసాగుతోంది. కొద్దికాలంలోనే భారత్ అధిక వృద్ధిని సాధించడానికి అవకాశం ఉంది. ప్రస్తుతమున్న భారీ రుణాలు క్రమంగా తగ్గుముఖం పడతాయని' రేటింగ్ పెంపు సందర్భంగా పేర్కొంది.
- 'భారత్‌కున్న భారీ అప్పులు దేశ రుణ ప్రొఫైల్‌పై ఒత్తిడి తీసుకొస్తాయి. ప్రభుత్వం తీసుకుంటున్న సంస్కరణలు ఆ ఒత్తిడిని క్రమంగా తగ్గిస్తాయని మూడీస్ విశ్వసిస్తో'ందని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వాస్తవ జీడీపీ వృద్ధిరేటు 6.7 శాతానికి పరిమితం అవుతుందని మూడీస్ గతంలో అంచనా వేసింది.
- పెద్ద నోట్ల రద్దు, ఆధార్ ద్వారా ప్రత్యక్ష నగదు బదిలీ వల్ల పారదర్శక ఆర్థిక వ్యవస్థ దిశగా భారత్ అడుగులు వేసిందని మూడీస్ అంటోంది. ప్రభుత్వం తీసుకున్న కీలక చర్యలైన భూ, కార్మిక సంస్కరణలు సైతం రేటింగ్ పెంపుపై ప్రభావం చూపాయని తెలిపింది.
- 'అవినీతిని తగ్గించడానికి, పన్ను వసూళ్లను పెంచడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. జీఎస్‌టీ అమలు, ప్రైవేటు పెట్టుబడుల్లో బలహీనతలు, బ్యాంకింగ్ రంగ ఆస్తుల నాణ్యత సమస్యల పరిష్కారంలో మందగమనం వంటి సవాళ్లు ఉన్నాయ'ని తెలిపింది.

వర్తమానం

# మోదీ తిరుగులేని నేత

## ప్యూ రీసెర్చ్ సంస్థ సర్వే వెల్లడి

● సుధా కస్తూరి



కాంగ్రెస్, విపక్షాలు, వారి తాబేదారు మీడియా పనిగట్టుకుని, గోచీ ఎగకట్టుకుని ఎంత ప్రచారం చేసినా భారత రాజకీయాల్లో నరేంద్ర మోదీకి తిరుగులేని ప్రజాదరణ ఉంది. ఈ విషయాన్ని అమెరికాలోని సుప్రసిద్ధ సర్వే సంస్థ ప్యూ రీసెర్చ్ తెలియచేసింది. తాజాగా ఫిబ్రవరి మార్చి నెలల్లో నిర్వహించిన దేశవ్యాప్త జనాదరణ సర్వేలో ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి తిరుగులేని జనాదరణ పొందిన నేతగా గుర్తింపు తెచ్చుకున్నారు.

ఈ సర్వేలో 88 శాతం మంది ప్రజలు నరేంద్ర మోదీని సమర్థించారు. రాహుల్ గాంధీ, అరవింద కేజ్రీవాల్‌లు రెండో మూడో స్థానంలో ఉన్నా, వారి ప్రజాదరణ అంతంత మాత్రమే. ప్యూ సర్వేలో తేలిందేమిటంటే అధికారంలోకి వచ్చి మూడేళ్లయిన తరువాత కూడా, మామూలుగా రాజకీయ హనీమూన్ వ్యవధి దాటిన తరువాత కూడా మోదీ పట్ల అమేయమైన సానుకూలత ఉంది. మోదీ నేతృత్వంలో భారత ఆర్థిక వ్యవస్థ తిరుగులేని శక్తిగా మారుతుందన్న విశ్వాసమే మోదీ హవాకు కారణమని సర్వే తెలిపింది. దేశవ్యాప్తంగా దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, గుజరాత్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి సర్వేలో పాల్గొన్న ప్రతి పదిమందిలో ఎనిమిది మంది ఆర్థిక వ్యవస్థ ఇప్పుడే గాడిలో పడిందని చెప్పడం గమనార్హం. దేశ పరిస్థితులపై ప్రతి పదిమందిలో ఏడుగురు సంతృప్తితో ఉన్నట్లు వెల్లడించారు. అలాగే తూర్పు రాష్ట్రాలైన బీహార్, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఉత్తర రాష్ట్రాలైన ఢిల్లీ, హర్యానా, మధ్యప్రదేశ్, పంజాబ్, రాజస్తాన్, ఉత్తర్ ప్రదేశ్‌లలో మోదీకి హవా ఏ మాత్రం తగ్గలేదు. 2015 తరువాత ఉత్తరాదిలో మోదీ ప్రజాదరణలో పెద్దగా మార్పు రాలేదని, పశ్చిమ రాష్ట్రాల్లో మాత్రం పెరిగిందని సర్వేలో వెల్లడైంది. అంతేకాదు.. భారత ఆర్థిక వ్యవస్థ అడుగు ముందుకే వేస్తోందని సర్వేలో పాల్గొన్న ప్రతి పదిమందిలో ఎనిమిది మంది అంగీకరించారు. అలాగే ఆర్థిక వ్యవస్థ చాలా బాగుందని 30 శాతం మంది యువకులు వెల్లడించారు. మొత్తం మీద ప్రతి పదిమందిలో ఏడుగురు దేశాభివృద్ధి, పాజిటివ్ సెంటిమెంట్ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. గమనార్హమైన విషయం ఏమిటంటే గత ఏడాది నవంబర్ 8న ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న పెద్దనోట్ల రద్దు నిర్ణయం ఏ మాత్రం వ్యతిరేక ప్రభావం చూపలేదు. అప్పట్లో 45 శాతం మంది ప్రజలు కరెన్సీ కోసం తీవ్ర ఇక్కట్లు పడ్డారు. అయినా ప్రజలు మోదీకి మద్దతు తెలిపారని సర్వే స్పష్టం చేసింది.

### ప్యూ రీసెర్చ్ ప్రకారం మోదీ పట్ల భారతీయుల అభిప్రాయం ఇది:

- **దాదాపు 57 శాతం మంది మోదీని గట్టిగా సమర్థించడమే కాదు.. ఆయన్ని అభిమానిస్తున్నారు. అంతే కాదు... అన్ని వర్గాల ప్రజల్లోనూ మోదీకి ప్రజాదరణ ఉంది.**
- **మోదీ పరిపాలన పట్ల 67 శాతం మంది సంతృప్తి ప్రకటించారు. ఆర్థిక వ్యవస్థ బాగా పనిచేస్తున్నదని 80 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే మోదీ అధికారం చేపట్టిన 2014లో ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినవారు 55శాతం మందే.**
- **కాంగ్రెస్ మద్దతుదారుల్లో కూడా 24శాతం మంది మోదీ పట్ల సానుకూల భావనతో ఉన్నారు. వారు మోదీ విధానాలను అంగీకరిస్తున్నారు. మోదీకి ఉన్న మద్దతు పట్టణాలు, గ్రామాల్లో సరిసమానంగా ఉండటం మరో విశేషం.**
- **నాలాంటి సామాన్యులకు మోదీ రక్షణ కల్పిస్తాడన్న భరోసా 56 శాతం మంది ఉండగా, మోదీ తాను అనుకున్న పనులను చేయగలుగుతాడు అని 51శాతం మంది దృఢంగా భావిస్తున్నారు.**
- **ప్రజల ఐక్యతకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందని 49 శాతం, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో మోదీ ప్రభుత్వం సరిగ్గా పనిచేస్తోందని 61 శాతం, అవినీతి అణచివేతపై 59 శాతం, నిరుద్యోగ సమస్య పరిష్కారంపై 62 శాతం, పేదల సంక్షేమంపై 62 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.**

ప్యూ నిర్వహించిన ఈ సర్వే ప్రకారం బిజెపి, నరేంద్ర మోదీ పట్ల ప్రజల విశ్వాసం చెక్కుచెదరలేదని నిరూపితం అవుతోంది. ఒక వర్గం మీడియా, కుహనా సెక్యులరిస్టు ముఠా ఎంత అసత్య ప్రచారం చేసినా, అది ప్రజాభిప్రాయాన్ని మార్చలేకపోతొందన్నది ఈ సర్వే స్పష్టం చేస్తోంది. ప్రజాభిప్రాయానికి అద్దం పట్టే ఈ సర్వే వివరాలు బయటకు వచ్చాక ఒక్క కాంగ్రెస్ వాది, ఒక్క కమ్యూనిస్టు కూడా నోరు మెదపకపోవడం గమనార్హం. ప్రజలకు ప్రజాస్వామ్యంపై అచంచల విశ్వాసం ఉందని కూడా ఈ సర్వే నిరూపించడం మరో విశేషం.■



కిరీటాన్ని ధరించే శిరస్సు సుఖానికి దూరమవుతుంది. – షేక్‌స్పియర్